

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 04-07-2025 | సంపుటి - 24 | సంచిక - 61 | రూ : 4 | పేజీలు: 8



## హైదరాబాద్‌కు ప్రపంచ నగరాలతోనే పోటీ

- మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్
- వందేళ్ల లక్ష్యంతో 'విజన్-2047' ప్రణాళికను రచిస్తున్నామన్న ప్రభుత్వం
- పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ
- తయారీ రంగంలో 9 శాతానికి పైగా వృద్ధి సాధించామన్న మంత్రి శ్రీధర్ బాబు
- 15 రోజుల్లోనే పరిశ్రమల అనుమతులు మంజూరు చేస్తున్నామని వెల్లడి

2లో

## జీతాల్లో హైదరాబాద్‌దే అగ్రస్థానం...

# ఫ్రెషర్స్‌కు చెన్నై స్వర్గధామం!

### అనుభవజ్ఞులకు అత్యధిక జీతాలు అందిస్తున్న నగరంగా హైదరాబాద్

- ఉద్యోగంలో కొత్తగా చేరే ఫ్రెషర్స్‌కు చెన్నైలో బెస్ట్ శాలరీలు
- ఇండీడ్ 'పేమ్యాప్ సర్వే'లో వెల్లడైన కీలక విషయాలు
- ఢిల్లీ, ముంబైలలో జీవన వ్యయానికి సరిపోని జీతాలు
- జీతాల విషయంలో ఐటీ రంగం ఆధిపత్యం యధాతథం

2లో







2లో

## తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు

# కొత్త న్యాయమూర్తులు

- తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త న్యాయమూర్తులు
- సుప్రీంకోర్టు కొలీజియం నుంచి కీలక సిఫారసులు
- ఏపీ హైకోర్టుకు తుహిన్ కుమార్ పేరు ప్రతిపాదన
- తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీల పేర్లు ఖరారు
- జూన్ 2న సమావేశంలో కొలీజియం నిర్ణయం



## 'మనబడికి మహా న్యూస్'.. ఛానల్‌ను మెచ్చుకున్న విద్యాశాఖ మంత్రి

2లో

- 'మనబడికి మహా న్యూస్' కార్యక్రమాన్ని ప్రశంసించిన మంత్రి నారా లోకేశ్
- ప్రభుత్వ పాఠశాలల్లోని సంస్కరణలను చూపించడంపై హర్షం వ్యక్తం
- సోషల్ మీడియా వేదికగా మహా న్యూస్ ఛానల్‌కు అభినందనలు



2లో

## భారత్‌లో 2,500 పార్టీలు ఉన్నాయి...

### ప్రధాని మోదీ చెప్పగానే ఆశ్చర్యపోయిన ఘనా ఎంపీలు

- ఆఫ్రికా దేశం ఘనాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- దేశ అత్యున్నత పురస్కారంతో ప్రధానికి ఘన సత్కారం
- ఘనా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగం
- ఆఫ్రికా అభివృద్ధికి భారత్ తోడ్పాటునందిస్తుందని హామీ
- ముప్పై ఏళ్ల తర్వాత ఘనా వెళ్లిన భారత ప్రధానిగా గుర్తింపు

# కుప్పంకు ఎయిర్ పోర్టు రానుంది..

### నియోజకవర్గంలో అన్నీ ఏసీ బస్సులే తిప్పుతాం: సీఎం చంద్రబాబు

- కుప్పం నియోజకవర్గ కార్యకర్తలతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం
- సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటి ప్రచారంపై కేడర్‌కు దిశానిర్దేశం
- పనులు చేయడమే కాదు, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడం కూడా ముఖ్యం అని స్పష్టీకరణ
- టీడీపీకి నిజమైన బ్రాండ్ కార్యకర్తలేనని, వారి వల్లే పార్టీ నిలబడుతుందని వెల్లడి
- ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకునే నాయకులను ఉపేక్షించేది లేదని తీవ్ర హెచ్చరిక
- కుప్పంలో అన్నీ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు తిప్పుతామని హామీ

ప్రభుత్వ పరంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ఎంత ముఖ్యమో, వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పాలనతో పాటు పార్టీ కార్యక్రమాలకు తాను సమాన ప్రాధాన్యత ఇస్తున్నానని, ఇదే స్ఫూర్తితో కార్యకర్తలు కూడా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గ టీడీపీ

తరువాయి 2లో



## భారత్‌లో
# 2,500 పార్టీలు ఉన్నాయి...

"భారతదేశంలో సుమారు 2,500 రాజకీయ పార్టీలు ఉన్నాయి" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటన విన్న ఘనా పార్లమెంట్ సభ్యులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. వారి స్పందనను గమనించిన ప్రధాని మోదీ చిరునవ్వులు చిందించారు. ఆఫ్రికా దేశమైన ఘనాలో పర్యటిస్తున్న ఆయన, గురువారం ఆ దేశ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత ప్రజాస్వామ్య వైవిధ్యం, దాని స్ఫూర్తి గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలను భిన్నమైన పార్టీలు పాలిస్తున్నాయని, 22 అధికారిక భాషలతో పాటు వేల సంఖ్యలో ఇతర భాషలు ఉన్నాయని మోదీ తెలిపారు. ఈ భిన్నత్వమే భారతీయుల విశాల హృదయానికి కారణమని, అందుకే ప్రపంచంలో ఎక్కడికెళ్లినా భారతీయులు అందరితో సులభంగా కలిసిపోతారని వివరించారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీకి అరుదైన గౌరవం దక్కింది. ఘనా దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డుతో ఆ దేశ ప్రభుత్వం ఆయనను సత్కరించింది. రాజధాని అక్రాలో జరిగిన కార్యక్రమంలో ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ చేతుల మీదుగా మోదీ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ అవార్డును 140 కోట్ల మంది భారతీయులకు అంకితమిస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మోదీ పునరుద్ఘాటించారు. ఆఫ్రికా అభివృద్ధి ప్రయాణంలో భారత్ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. జీ20 కూటమిలో ఆఫ్రికా యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం లభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గత మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే మొదటిసారి.

# కుప్పంకు ఎయిర్ పోర్టు రానుంది..

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. "సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటి ప్రచారం" అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని, దీని ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని చంద్రబాబు తెలిపారు. "అభివృద్ధికి బ్రాండ్ టీడీపీ అయితే, ఆ టీడీపీకి బ్రాండ్ కార్యకర్తలే. నేతలు అటూ ఇటూ మారుతున్నారేమో కానీ, కార్యకర్తలే శాశ్వతంగా ఉంటారు" అని అన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్లలో కోతలు విధించారని, కానీ తాము అర్హులందరికీ పెన్షన్లు అందిస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చంద్రబాబు వెల్లడించారు. భవిష్యత్తులో కుప్పంకు ఎయిర్‌పోర్ట్ రానుందని, నియోజకవర్గంలో కేవలం ఏసీ ఎలక్ట్రిక్ బస్సులే నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 100 శాతం సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయాలని, మల్లప్పకొండ వంటి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. హంద్రీనీవా జలాలతో కుప్పంలో కరవు అనే మాటే లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు చంద్రబాబు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ప్రజలకు మేలు చేసే వారే తనకు దగ్గరగా ఉంటారని, ఎవరైనా ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటే వారిని నిర్మొహమాటంగా పక్కన పెడతానని స్పష్టం చేశారు. ఈ ఫార్ములా కేవలం కుప్పానికే కాదని, రాష్ట్రవ్యాప్తంగా వర్తిస్తుందని తేల్చిచెప్పారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం పూర్తి చేయాలని, పార్టీ పట్ల సానుకూల దృక్పథాన్ని పెంచాలని కార్యకర్తలకు ఆయన లక్ష్యం నిర్దేశించారు.

# హైదరాబాద్‌కు ప్రపంచ నగరాలతోనే పోటీ

తెలంగాణ రాజధాని హైదరాబాద్ దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నామని స్పష్టం చేశారు. గురువారం నాడు రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కుతో పాటు, 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ విభాగాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికే ఒక 'ఫ్యూచర్ సిటీ'ని అందిస్తోందని పేర్కొన్నారు. "రానున్న వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'విజన్2047' ప్రణాళికను రూపొందించాం. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశీ కన్సల్టెంట్లు పని చేస్తున్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పించి, వారి వ్యాపారాలు లాభదాయకంగా సాగేలా చూసే బాధ్యత మాది" అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. అభివృద్ధిలో తెలంగాణ.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలతో పోటీ పడుతోందని తెలిపారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో తయారీ రంగం 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని వివరించారు. ప్రభుత్వం ఇటీవల గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్ఎంఈ పాలసీ 2025ను ఆమోదించిందని గుర్తుచేశారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు కోసం 4,200 దరఖాస్తులు రాగా, వాటిలో 98 శాతం దరఖాస్తులను కేవలం 15 రోజుల్లోనే పరిష్కరించామని చెప్పారు. సింగిల్ విండో విధానం ద్వారా పారదర్శకంగా, వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు
# కొత్త న్యాయమూర్తులు

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులలో కొత్త న్యాయమూర్తుల నియామకానికి మార్గం సుగమమైంది. ఇరు రాష్ట్రాల హైకోర్టులకు కలిపి మొత్తం ఐదుగురు కొత్త జడ్జీల పేర్లను సుప్రీంకోర్టు కొలీజయం సిఫారసు చేసింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజయం కీలక నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే, తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తుల పేర్లను కొలీజయం ప్రతిపాదించింది. వీరిలో సుద్దాల చలపతిరావు, గాడి ప్రవీణ్ కుమార్, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహిద్దీన్ ఉన్నారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ పేరును సిఫారసు చేయడం జరిగింది. జూన్ 2వ తేదీన జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు కొలీజయం ఈ ఐదుగురి పేర్లను ఖరారు చేసి, వారి నియామకం కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసులను పంపింది. కేంద్రం ఆమోదం తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వులతో వీరి నియామకాలు అధికారికంగా ఖరారు కానున్నాయి.

## జీతాల్లో హైదరాబాద్‌దే అగ్రస్థానం...
# ఫ్రెషర్స్‌కు చెన్నై స్వర్గధామం!..

భారతదేశంలో ఉద్యోగ వేతనాల విషయంలో సరికొత్త ట్రెండ్ మొదలైంది. ఒకప్పుడు బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలు మాత్రమే అధిక జీతాలకు చిరునామాగా ఉండేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా దక్షిణాది నగరాలైన చెన్నై, హైదరాబాద్‌తో పాటు అహ్మదాబాద్ వంటి నగరాలు కొత్త శాలరీ హాట్‌స్పాట్లుగా ఎదుగుతున్నాయి. ప్రముఖ జాబ్ పోర్టల్ 'ఇండీడ్' విడుదల చేసిన 'పేమ్యాప్ సర్వే'లో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా 1,311 యాజమాన్యాలు, 2,531 మంది ఉద్యోగుల నుంచి సేకరించిన అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించారు. కరోనా అనంతర ఆర్థిక వ్యవస్థలో జీతాల ప్రమాణాలు, రంగాల వారీగా ధోరణులు, ఉద్యోగుల మనోభావాలను అర్థం చేసుకోవడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశం.

* **ఫ్రెషర్లకు చెన్నై.. అనుభవజ్ఞులకు హైదరాబాద్!**

ఈ సర్వే ప్రకారం, ఉద్యోగ జీవితాన్ని ఇప్పుడే ప్రారంభిస్తున్న ఫ్రెషర్లకు (02 ఏళ్ల అనుభవం) చెన్నై నగరం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తోంది. ఇక్కడ అన్ని రంగాల్లో కలిపి ఫ్రెషర్లు నెలకు సగటున రూ. 30,100 జీతం అందుకుంటున్నారు. మరోవైపు, మధ్యస్థాయి, సీనియర్ స్థాయి (58 ఏళ్ల అనుభవం) ఉద్యోగులకు అత్యధిక వేతనాలు అందించడంలో హైదరాబాద్ నగరం అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ అనుభవజ్ఞులు నెలకు రూ. 69,700 వరకు సంపాదిస్తున్నారని నివేదిక స్పష్టం చేసింది. ఈ పరిణామం, కెరీర్‌లో ఉన్నత స్థాయికి వెళ్లాలనుకునే వారికి హైదరాబాద్ ఒక ఆకర్షణీయమైన కేంద్రంగా మారుతోందని సూచిస్తోంది.

**మారుతున్న ఉద్యోగ సమీకరణాలు**

గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా ఉద్యోగుల జీతాలు సగటున 15 శాతం పెరిగినప్పటికీ, ఈ వృద్ధి సంప్రదాయ ఆర్థిక కేంద్రాలకే పరిమితం కాలేదని నివేదిక పేర్కొంది. "జీతాల విషయంలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఉద్యోగులు ఇప్పుడు జీవన వ్యయంతో పాటు కెరీర్ అవకాశాలకు అనుగుణంగా జీతాలు లభించే నగరాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మా డేటా ప్రకారం, అవకాశాలు ఇకపై కేవలం పెద్ద మెట్రో నగరాలకే పరిమితం కాలేదు, అవి ఇతర నగరాలకు కూడా విస్తరిస్తున్నాయి," అని ఇండీడ్ ఇండియా సేల్స్ హెడ్ శశి కుమార్ వివరించారు.

**ఖరీదైన నగరాలు.. తక్కువ సంతృప్తి**

సర్వేలో పాల్గొన్న వారిలో 69 శాతం మంది ఉద్యోగులు తాము నివసిస్తున్న నగరాల్లో జీవన వ్యయానికి తగినట్లుగా తమ ఆదాయం లేదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఢిల్లీ (96%), ముంబై (95%), పుణె (94%), బెంగళూరు (93%) వంటి ఖరీదైన మెట్రో నగరాల్లో ఈ అసంతృప్తి అత్యధికంగా ఉంది. దీనికి విరుద్ధంగా చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతా వంటి నగరాలు తక్కువ ఖర్చుతో కూడుకున్నవిగా ఉండటంతో, ఉద్యోగులకు ఆర్థికంగా కొంత వెసులుబాటు లభిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఐటీ రంగం హవా**

రంగాల వారీగా చూస్తే, అన్ని స్థాయిల అనుభవజ్ఞులకు అధిక జీతాలు అందించడంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ/ఐటీఈఎస్) రంగం తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. డిజిటల్, ఏఐ ఆధారిత నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాండే ఇందుకు ప్రధాన కారణం. ఈ రంగంలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ నుంచి హెచ్ఆర్ ఇంజనీర్ల వరకు వివిధ హోదాల్లోని ఫ్రెషర్లు సగటున రూ. 25,000 నుంచి రూ. 30,500 మధ్య జీతం పొందుతున్నట్లు నివేదిక పేర్కొంది.






# భారత రక్షణ రంగం బలోపేతం దిశగా కీలక ముందడుగు

* **రక్షణ రంగానికి సంబంధించి కీలక నిర్ణయం**
* **రూ. 1.05 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోలుకు ఆమోదం**
* **రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డీఏసీ సమావేశం**
* **పూర్తిగా దేశీయ కంపెనీల నుంచే సేకరణ**
* **'మేక్ ఇన్ ఇండియా'తో పెరిగిన రక్షణ ఉత్పత్తులు, ఎగుమతులు**

భారత రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేసింది. సుమారు రూ. 1.05 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు, ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఉన్న రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) గురువారం ఆమోదం తెలిపింది. ఈ కొనుగోళ్లన్నీ పూర్తిగా దేశీయ కంపెనీల నుంచే చేపట్టనుండటం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పెద్ద ఊతంగా నిలవనుంది. ఈ సమావేశంలో త్రివిధ దళాల అవసరాల కోసం క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు (ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్), ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, ఇంటిగ్రేటెడ్ కామన్ ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి 10 కీలక ప్రతిపాదనలకు 'అవసర ఆమోదం' (AoN) లభించింది. వీటితో పాటు నౌకాదళం కోసం మైన్ కౌంటర్ మెజర్ వెస్సెల్స్, సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్ వంటి అత్యాధునిక పరికరాలను కూడా సేకరించనున్నారు. ఈ కొత్త ఆయుధాలు, వ్యవస్థల చేరికతో త్రివిధ దళాల కార్యాచరణ సామర్థ్యం మరింత పటిష్ఠం కానుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సదస్సులో మాట్లాడిన రాజ్‌నాథ్ సింగ్, దేశీయ రక్షణ ఉత్పత్తులు రికార్డు స్థాయికి చేరాయని తెలిపారు. "పదేళ్ల క్రితం కేవలం రూ. 43,000 కోట్లుగా ఉన్న మన రక్షణ ఉత్పత్తి, ఇప్పుడు రూ. 1.46 లక్షల కోట్లను దాటింది. అదే విధంగా, రూ. 600-700 కోట్లుగా ఉన్న మన రక్షణ ఎగుమతులు నేడు రూ. 24,000 కోట్ల రికార్డును అధిగమించాయి" అని ఆయన వివరించారు. దేశ భద్రతకు, శ్రేయస్సుకు 'మేక్ ఇన్ ఇండియా' విధానం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయాణంలో 16,000కు పైగా ఎంఎస్ఎంఈలు భాగస్వాములై లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని మంత్రి తెలిపారు.

## గ్రూప్1 వివాదం..
# కోర్టులో వాదనలు వినిపించిన టీజీపీఎస్సీ

* **గ్రూప్-1 పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో కొనసాగుతున్న విచారణ**
* **టీజీపీఎస్సీ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి**
* **కోఠి సెంటర్ నుంచి ఎక్కువమంది ఎంపికయ్యారన్న ఆరోపణల ఖండన**
* **అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి వ్యత్యాసం లేదని స్పష్టీకరణ**
* **ఉద్యోగం రానివారే అనుమానాలతో పిటిషన్లు వేశారని కోర్టుకు వెల్లడి**



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. గ్రూప్ 1 ఎంపికల విషయంలో వస్తున్న ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని, అవన్నీ కేవలం అపోహలు మాత్రమేనని ఆయన కోర్టుకు స్పష్టం చేశారు. ముఖ్యంగా, కోఠిలోని ఒకే పరీక్షా కేంద్రం నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు ఎంపికయ్యారంటూ వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కోఠిలో ఉన్న రెండు కేంద్రాలను కేవలం మహిళా అభ్యర్థుల సౌకర్యం కోసమే కేటాయించామని తెలిపారు. ఆ కేంద్రాల నుంచి దాదాపు 1,500 మంది మెయిన్స్ పరీక్ష రాయగా, ఇతర కేంద్రాల నుంచి అంతకంటే ఎక్కువ సంఖ్యలోనే అభ్యర్థులు ఎంపికయ్యారని వివరించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్యలోనూ ఎటువంటి తేడాలు లేవని నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి పారదర్శకంగా వ్యవహరించామని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపిక కాని కొందరు అభ్యర్థులు నిరాధారమైన అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారని, వారి ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని వాదించారు.

# విపత్కర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి అండగా నిలబడాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే వర్షాల దృష్ట్యా సంభవించే వరదలలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న బాధితులను రక్షించడానికి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 05 డీడీఆర్ఎఫ్ బృందాలు నిత్యం ప్రజలకు అందు బాటులో ఉంటాయని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా అన్ని శాఖలతో సమన్వయం పాటిస్తూ ముందుకెళ్తున్నామని తెలిపారు.ఇందులో భాగంగానే గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు మరియు 6వ బెటాలియన్ టీజీఎస్పి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలోని ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణను పొందిన డిడిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు.ముఖ్యంగా గోదావరి నది వరదలు సంభవించినప్పుడు నదీ పరివాహక ప్రాంతాలలో నివసించే లోతట్టు ప్రాంత ప్రజలను సంరక్షించడానికి ఈ బృందాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని తెలియజేశారు.రెస్క్యూ సమయంలో అవసరమయ్యే లైఫ్ జాకెట్స్,లైఫ్ బాయ్ రింగ్స్,బోట్ పెడల్స్,రోప్స్ , ఇతర సామాగ్రి మొత్తాన్ని ఈ బృందాలకు సమకూర్చడం జరిగిందన్నారు.జిల్లాలో ఏ ప్రాంతంలో ఎలాంటి విపత్తు ఎదురైనా అక్కడి బాధితులను సంరక్షించేందుకు సమన్వయంతో అన్ని శాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.రాబోయే భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంత ప్రజలు కూడా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విపత్కర సమయాల్లో డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను వినియోగించుకోవాలని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్,జిల్లా అగ్నిమాపక శాఖాధికారి క్రాంతి కుమార్,6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్,ఆపరేషన్స్ ఆర్ఐ రవి , సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రేగళ్ల గ్రామంలో ఉచిత క్యాన్సర్ క్యాంప్




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వికాస తరంగిణి కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమం శుక్రవారం 4 న రేగళ్ల గ్రామంలో ఉచిత క్యాన్సర్ క్యాంప్ నిర్వహించబడుతుంది. ముఖ్య అతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి.రోహిత్ రాజు హాజరవుతున్నారు. ఈ క్యాన్సర్ క్యాంప్ ని మహిళలందరూ ఉపయోగించుకోవాల్సిందిగా వికాస తరంగిణి కోఆర్డినేటర్ గుంటూరి రమాదేవి, సభ్యులు రాజ్యలక్ష్మి, పూర్ణ మొబైల్స్ యజమాని యెల్దండి పూర్ణచందర్ రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షులు లగడపాటి రమేష్ చంద్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం నూతన కమిటీ ఎన్నిక



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: లయన్స్ క్లబ్ ఆఫ్ మిలినియం కొత్తగూడెం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శు లుగా బొక్కా శ్రీనివాస్, నెమళ్ల నరేష్, కోశాధికారిగా పగడాల నరేష్ ఎన్నికయ్యారు. మిలినియం బాధ్యులు మాట్లా డుతూ సేవా రంగంలో విస్తృతస్థాయి కృషి చేస్తామని ఉద్ఘాటించారు. గతంలో కొత్తగూడెం లయన్స్ క్లబ్ మిలినియం సభ్యులు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని శక్తివంచన లేకుండ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. శివ ప్రసాద్, పితాని సత్యనారాయణ, బాణోత్ సక్రు పాల్గొన్నారు.

*** లయన్స్ క్లబ్ అఫ్ మిలీనియం కొత్తగూడెం నూతన కార్యవర్గం లో కోశాధికారిగా పగడాల నగేష్**

లయన్స్ క్లబ్ అఫ్ మిలీనియం కొత్తగూడెం నూతన కార్యవర్గం లో రామవరం ప్రాంతానికి చెందిన పగడాల నగేష్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో నిష్టగా పాల్గొనే నగేష్ ఎన్నిక పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు

*** మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు**

*** ముస్తాబాద్ ఎస్ఐ గణేష్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కేవలం మీరే కాకుండా మీ వల్ల ఇతరులు కూడా ప్రమాదంలో బాధితులవుతారని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో ఎస్ఐ గణేష్ గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్, ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ తప్పక ధరించాలని, ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని, పరిమితికి మించి వేగంగా ప్రయాణించి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## నూతన జాక్వార్ బాత్ అండ్ లైటింగ్ షోరూం ప్రారంభం

శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : కొండాపూర్ పరిధిలో హైటెన్షన్ లైన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన జాక్వార్ బాత్ అండ్ లైటింగ్ షోరూం ను ఉమ్మడి రాష్టాల డిస్ట్రిబ్యూటర్ , సూర్య ఇంటర్నేషనల్ అధినేత డాక్టర్. పెండ్యాల హరినాథ్ బాబు, అశోక్ బాత్ కాన్సెప్ట్ చైర్మన్ అశోక్ చౌదరి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం జాక్వార్ ఉమ్మడి రాష్టాల డిస్ట్రిబ్యూటర్ డాక్టర్. పెండ్యాల హరినాథ్ బాబు మాట్లాడుతూ కొండాపూర్ పరిధిలో అశోక్ బాత్ కాన్సెప్ట్స్ ఆధ్వర్యంలో జాక్వార్ షోరూం ను ఏర్పాటు చేశామన్నారు.అశోక్ బాత్ కాన్సెప్ట్స్ 2008లో వ్యాపారం ప్రారంభించరని,జాక్వార్ కంపెనీ కు సంబందించిన అన్ని ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో వున్నాయన్నారు. 64సంవత్సరాల నుండి జాక్వార్ ఉత్పత్తులు దేశ వ్యాప్తంగా అద్భుతమైన రీతిలో అందరికి చేరువయమ్మన్నారు. జాక్వార్ అనేది మేడ్ ఇన్ ఇండియా కంపెనీ అని, అందుకే దేశ వ్యాప్తంగా తమకు మంచి పేరు వచ్చిందని ఆనందం వ్యక్తం చేసారు.జాక్వార్ ఉత్పత్తులు అంటే శానిటరి కాకుండా, షవర్ ఎంక్లోజర్స్,బాత్ స్పెషల్, స్టీమ్ జనరేటర్స్, అన్ని ఇక్కడ వున్నాయని తెలిపారు.జాక్వార్ లైటింగ్స్ 450కోట్ల తో కొత్త కంపెనీ కూడా ఏర్పాటు చేశామని అన్నారు.ప్రతి ఇంటికి కావాల్సిన ఉత్పత్తులు జాక్వార్ కంపెనీ లో వున్నాయని ఈ సందర్భంగా తెలిపారు.తెలంగాణ &ఏపీ బ్రాంచ్ హెడ్ అభిజిత్ సింగ్ మాట్లాడుతూ అశోక్ బాత్ కాన్సెప్ట్ ఆధ్వర్యంలో అన్ని ప్రొడక్ట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.కస్టమర్స్ కోసం అన్ని రకాల బాత్ ఫిట్టింగ్స్ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.అన్ని రేంజ్ ప్రొడక్ట్స్ ఇక్కడ వున్నాయి. మంచి ఇళ్ళు లో కావాల్సిన డిజైన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమం లో అశోక్ బాత్ కాన్సెప్ట్స్ యజమాని అశోక్ చౌదరి, జాక్వార్ రిటైల్ హెడ్ గిరీష్ కుమార్, జాక్వార్ మేనేజర్ శివ కుమార్, సన్ ఇంటర్నేషనల్ మేనేజర్ నవీన్ కుమార్ మోటారం చౌదరి తదితరులు పాల్గొన్నారు.




### విద్యార్థుల జీవితాలతో
## చలగాటం ఆడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం కొత్తగూడెం పట్టణంలోని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టి.యూ) కార్యాలయంలో జిల్లా నాయకుడు టీ.అరుణ్ అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సాంబ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ వేల, కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని, రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ల మీద ఆధారపడి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా కార్పొరేటు, ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరిన విద్యార్థులు ఆర్థికపరంగా మానసిక వేదనను ఎదుర్కొంటున్నారని, దీనిని సాకుగా చూపుతూ విద్యార్థులకు వారి ధ్రువీకరణ పత్రాలను విద్యాసంస్థలు విద్యార్థులకు ఇవ్వడం లేదని, ప్రజా పాలనంటు గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకుని రెండో సంవత్సరం పూర్తి కావస్తున్న విద్యారంగాన్ని కనీస పట్టించుకునే పరిస్థితిలో లేదని, విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా విద్యాశాఖను తన వద్దనే పెట్టుకున్నా ముఖ్యమంత్రి పెండింగ్ లో ఉన్న రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడని, అనేక సమస్యల నడుమనే ఈ విద్యా సంవత్సరానికి ప్రారంభించారు అని అటు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర యూనివర్సిటీలపై పెత్తనం కొరకు యూజీసీ నిబంధనలను సడలిస్తు నూతన నిబంధనలను తీసుకొస్తుంది అని, నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగానికి మతం రంగు పుస్తున్నారు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిరుకరుస్తూ కార్పొరేట్, ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను సమస్యలకు నిలయాలుగా మారుస్తున్నారని, విద్యని పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మార్చే కుట్రే అని, తక్షణమే పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించాలని, ప్రభుత్వ విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జె గణేష్, బి.హరి లాల్ టీ. కవినప్రియ తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కొత్తగూడెం రైటర్ బస్తీలోని భవిత కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవిత కేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నిర్వహణ విధానాలు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముచ్చటించి వారికి అందుతున్న శిక్షణ, కల్పిస్తున్న సౌకర్యాలు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని



తెలుసుకున్నాను. దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్లలో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుగా భవిత కేంద్రాలు ఉపయోగపడుతు న్నాయని, ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధన కోసం అవసరమైన అన్ని పరికరాలు, స్టడీ మెటీరియల్ తెప్పించాలని ఆదేశించారు. రెయిలింగ్, ర్యాంపు రాంప్ వంటివి పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ఫిజియోథెరపిస్టు కచ్చితంగా కేంద్రానికి వచ్చేలా చూడాలని అన్నారు. భవిత కేంద్రంలో విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్ది ప్రత్యేక పాఠశాల నుండి సాధారణ పాఠశాల కు పంపడానికి చేస్తున్న కృషికి సిబ్బందిని అభినందించారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో రాజీవ్ గృహకల్పను అభివృద్ధి చేసుకోవాలి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఐకమత్యంతో రాజీవ్ గృహకల్పను అభివృద్ధి చేసుకునే విధంగా నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బాచుపల్లి 2



బి.హెచ్.కే 7వ బ్లాక్ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజీవ్ గృహకల్పలో సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గ సభ్యులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. రాజీవ్ గృహకల్ప లోని లబ్ధిదారుల సమస్యలు, బాగోగులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు దుర్గాప్రసాద్, ముఖ్య సలహాదారులు మద్దెల సత్యనారాయణ, సలహాదారులు భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శి సత్యవతి, కోశాధికారి మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, సంయుక్త కార్యదర్శి రామారావు, ఉపాధ్యక్షులు సజ్జు, కార్యనిర్వా కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ని గురువారం ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా ఎస్. సూర్య నారాయణ రెడ్డి,అధ్యక్షులుగా చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వడ్డెమాను సుందర్, ఉపాధ్యక్షులుగా సైరెడ్డి సాగర్ రెడ్డి, చింత రమేష్, కోశాధికారిగా మరాటి మల్లేష్, కో ఆర్డినేటర్ గా ఆర్ నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా చిన్నం మధు, ఎన్.అంజన్ కుమార్, డి.దయాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చిన్నం గణేష్, భూష గణేష్, బి.బాస్కరా చారి, ఎస్.కరుణాకర్ రెడ్డి, మరాటి మత్స్యగిరి,జె.భగీరధ్ రెడ్డి, ఆర్.తిరుపతి రెడ్డి, జె.నరేందర్ యాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కమిటీ రెండు సంవత్సరాల కాలపరిమితి ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు కల్వూరి ఎల్లయ్య, సీనియర్ జర్నలిస్టు వీఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక జర్నలిస్టుల సంక్షేమం కోసం క్లబ్ పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ హితానికై ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టండి

*** కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పర్యావరణ హితానికై ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు మట్ట రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్లాస్టిక్కు వ్యతిరేకంగా ఉద్యమించడం హర్షించదగ్గ విషయం అన్నారు.ప్లాస్టిక్ను వ్యతిరేకిస్తూ ఒకపక్క ఉద్యమిస్తూ మరోపక్క వారికి వీలైనంతగా ఉచిత క్లాత్ బ్యాగులను పంపిణీ చేయడం వారికి పర్యావరణం పట్ల ఉన్న శ్రద్ధకు నిర్వచనం అన్నారు. వారితోపాటు మనం కూడా ప్రతి ఒక్కరం పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకొని ప్లాస్టిక్ బ్యాగులను వాడకుండా కేవలం క్లాత్ బ్యాగులను వాడి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

## కాపర్ వైర్ దొంగల అరెస్ట్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జూన్ నెల లో 23,24 తేదీలలో సింగరేణి సంస్థ 5 వ ఇంక్లైన్ మైన్ ఏరియాలో సెక్యూరిటీ గార్డు డ్యూటీ మారే సమయంలో దొంగతనం జరిగి,దాదాపు రూ.10,900 విలువైన 16 మీటర్ల కాపర్ వైర్ను అపహరణకు గురైంది.సింగరేణి యాజమాన్యం సీసీ కెమెరాల ఆధారంగా ఈ ఘటనను గుర్తించిన అనంతరం టూ టౌన్ పోలీస్ స్టేషన్కు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం జూలై 3వ తేదీన టూ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్,సిబ్బంది తో రుద్రంపూర్ రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న సందర్భంగా నిందితులు చోరీ చేసిన కాపర్ వైర్తో వెళుతుండగా పట్టుబడ్డారు. వారు వెంట తీసుకెళ్తున్న కర్రల సంచిలో చోరీ చేసిన కాపర్ వైర్ గుర్తించి,పంచనామా నిర్వహించి నిందితులైన కాపర్ల వెంకటేష్,పాసి రాము,వేంపల్లి ఆకాష్ లను స్టేషన్కు తరలించి అనంతరం నిందితులను కోర్టుకు హాజరు పరచి రిమాండ్కు తరలించారు.

# నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి

* **సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ డిమాండ్ చేశారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఈ నెల 9వ తేదిన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కు సంబంధించిన సమ్మె పోస్టర్ ను సిఐటియు నాయకులతో కలిసి ఆయన పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలి చేసేందుకు చేస్తున్నారన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న యజమానులు వలస కార్మికులతో అధికారికంగానే 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. విర్కో లేబరేటరీస్, నకోడ కెమికల్స్, వసంత టూల్స్, మెట్రో కమ్ లాంటి చాలా పరిశ్రమల్లో కాంట్రాక్ట్ పేరుతో కార్మికుల శ్రమ దోచుకుంటున్నారన్నారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జీడిమెట్ల ప్రాంతంలో ఉన్న. లేబర్ కోడ్లు అమల్లోకి రాకముందే అంతేకాదు కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదు. చట్టం ప్రకారం రావలసిన ఈఎస్ఐ, పీఎఫ్ కూడా అమలు చేయడం లేదన్నారు. ఫార్మా అండ్ కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు కనీస భద్రత సౌకర్యాలు కూడా యాజమాన్యాలు కల్పించడం లేదన్నారు. ఎంతోమంది కార్మికుల ప్రాణాలు (ప్రమాదాలు జరిగినప్పుడు) గాలిలో కలిసిపోతున్నాయి. పట్టించుకోవలసిన లేబర్ అధికారులు లంచాలకు అలవాటై కార్మికుల వైపు కన్నెత్తి కూడా చూసే పరిస్థితులలో లేరు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. గతంలోకార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోడీ రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చాడు.ఇవి అమలు జరిగితే 300 మంది లోపు కార్మికులు ఉంటే ఆ సంస్థను యాజమాన్యాలు ప్రభుత్వం అనుమతి లేకుండానే ఎప్పుడైనా మూసేయొచ్చు. కార్మికులకు గతంలో ఉన్న సమ్మెహక్కును ఇప్పుడు బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలన్నారు. సమన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. నెలకు కనీస పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వాలని, దరఖాస్తు పెట్టిన 45 రోజులలో యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. పెంచిన నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మకూడదు. రైతాంగానికి కనీస మద్దతు ధర అమలు చేయాలన్నారు. పేద ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వమే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య, దేవదానం, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

## సర్వే నెంబర్ 336లో
# విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు

* **ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు నిర్మించకుండా చర్యలు తీసుకోవాలి**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్పల్లి మండల పరిధిలోని సర్వే నెంబర్ 336లో గల ప్రభుత్వ భూమిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు పిలుస్తున్నాయి. ఎన్నిసార్లు కూలగొట్టిన భూకబ్జాదారులు రెచ్చిపోతూనే ఉన్నారు. మండలాధికారులు పలుమార్లు కూలగొట్టినప్పటికీ కబ్జాలు చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య లాగా మారిపోతుంది. లక్షల రూపాయల విలువలు చేసే ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారిపోతుంది. ఆల్విన్ కాలనీకి ఆనుకొని ఉన్న 336 లో గల ప్రభుత్వ స్థలంలో ఓ భూ కబ్జాదారుడు రాత్రికి రాత్రే గుర్తు చప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాన్ని నిర్మించాడు. స్థానికులు మండల అధికారులు కూలగొట్టిన స్థలంలో మళ్లీ ఎందుకు నిర్మిస్తున్నారని అడుగుతే వారిపై రెచ్చిపోతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. మండల అధికారులు గతంలో కూల్చి వేసిన ప్రదేశంలో సగం గూడా అడ్డుగా ఉండడంతో దానికి చాటుగా మరొక అక్రమ నిర్మాణం నిర్మించాలని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టి వారి పట్ల మండలాధికారులు పూర్తిస్థాయిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. తిరిగి అక్కడ నిర్మాణం నిర్మించకుండా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు మండల అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# జూలై 6న ఐటీ బోనాల జాతర

* **టీహబ్‌లో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా టీటా బోనాల పోస్టర్ ఆవిష్కరణ**
* **శిల్పకళా వేదిక నుంచి చిన్న పెద్దమ్మ దేవస్థానానికి భక్తిశ్రద్ధలతో ఊరేగింపు**




హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : ఈ ఏడాది ఐటీ బోనాలు వేడుకలు, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖతో భాగస్వామ్యంలో నిర్వహించబడతున్నాయని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణ సాంప్రదాయాలకు ఆధునికతను మేళవిస్తూ, టీహబ్ వేదికగా తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) బోనాలు 2025 పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటా గ్లోబల్ అధ్యక్షుడు సుందీప్ కుమార్ మక్తాలా , బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుందీప్ మక్తాలా, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ కి సంస్కృతి పరిరక్షణలో అందిస్తున్న అప్రతిహత మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆషాఢ మాసం రెండో ఆదివారం, జూలై 6న జరగనున్న ఈ ఐటీ బోనాలు వేడుకల్లో, గతంలో పాల్గొన్న తన అనుభవాలను గుర్తు చేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు "నానిటి వాతావరణంలో సంప్రదాయాన్ని నిలిపే ఈ వేడుకలు ఎంతో గొప్పవన్నారు. టీటా ద్వారా ఈ సంస్కృతి ఆధారిత కదలిక ఐటీ కారిడార్‌లో నిలబెట్టడం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా, శిల్పకళా వేదిక నుంచి చిన్న పెద్దమ్మ దేవస్థానానికి భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఊరేగింపు ప్రారంభానికి ముందు, సుందీప్ మక్తాలా కుటుంబం, అమ్మవారికి సారీసెట్టూ , వడి బియ్యాన్ని సమర్పించే సంప్రదాయ పూజ నిర్వహిస్తారన్నారు. ఇన్ఫోసిస్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ సహా ప్రముఖ ఐటీ కంపెనీల నుండి వచ్చిన 21 బోనాలు, తమ తమ కార్యాలయాల నుండి బయలుదేరి శిల్పకళా వేదిక వద్ద కలుస్తాయి. అక్కడి నుండి ఊరేగింపుగా చిన్న పెద్దమ్మ దేవస్థానానికి ప్రదక్షిణగా సాగుతాయి. భక్తితో పాటు సంగీతం, సంప్రదాయం, ఐక్యత నిండిన ఈ ప్రదర్శన ఉద్యోగులకు ఓ సాంస్కృతిక పండుగను రుచి చూపించనుంది. పోతురాజులు, శివసత్తులు, డప్పులు, ఒగ్గు డోలు, గుస్సాడి తదితర ప్రజాకళల బృందాలు సాంప్రదాయ ప్రదర్శనలు ఇస్తాయి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ జానపద కళలకు అంతర్జాతీయ ఐటీ వేదికపై గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా సుందీప్ మక్తాలా మాట్లాడుతూ, "టీటా బోనాలు అనేవి కేవలం పండుగ కాదు ఇది మన మూలాలను గుర్తుచేసే మౌలిక సంకేతం. ఐటీ వాతావరణంలో కూడలి చూపిస్తూ, సంస్కృతిని నిలబెట్టే గొప్ప వేదికగా నిలుస్తున్నాయి. ఈ మహోత్సవాన్ని జరిపేందుకు మద్దతునిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యంగా భాషా సాంస్కృతిక శాఖకు మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి ఐటీ బోనాలు కూడా హైదరాబాద్లోని ఐటీ ఉద్యోగుల కోసం ఒక ఆధ్యాత్మిక, సాంస్కృతిక పునర్మిళపాటు జరుపుకోబోతున్నాయి. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి వాకిటీ, శ్రీనివాస్ మారి, హరిని గోలీ, యామిని, మనసా, దినేష్, కీర్తన్, ప్రణీత్, వెంకట్ బూరా వంటి టీటా బోనాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్లను
# మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందించాలి

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : నిర్మాణ పనులు పూర్తయిన సీసీ రోడ్లను మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందించాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా గురువారం డివిజన్ పరిధి ఎల్లమ్మబండ మొగులమ్మ కాలనీ లో నిర్మాణ పనులు జరుగుతున్న డ్రైనేజీ , సీసీ రోడ్ల ను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మొగులమ్మ కాలనీలో నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయని, త్వరలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టి యుద్ధప్రాతిపదికన నాణ్యమైన సీసీ రోడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, జాన్, సి.హెచ్. భాస్కర్, గుడ్ల శ్రీనివాస్, ప్రదీప్, కటికరవి, కృష్ణ, నరసింహ, ప్రసాద్,శ్యామ్సన్, విక్రమ్, కనకయ్య, నాగరాజు, వర్క్ ఇన్స్పెక్టర్స్ రవి కుమార్ , శ్రీనివాస్, సూపర్వైజర్ శివ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 9న జరిగే సమ్మెను విజయవంతం చేయండి

* **సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జేఏసీ నాయకుల పిలుపు**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈనెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాపిత ఒక్కరోజు సార్వత్రిక సమ్మెలో సింగరేణి అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం కార్పోరేట్ హెడ్ ఆఫీస్ ,ఇల్లందు బంగ్లోస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల గేట్ మీటింగ్ ల ను జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్,ఏఐటియుసీ నుండి యర్రగాని కృష్ణయ్య, ఐ ఎన్ టి యు సి నుండి పితాంబరం,ఆల్బర్ట్ సిఐటియు టి యు సి ఐ నుండి పి సతీష్‌లు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అత్యంత దుర్మార్గంగా రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించేస్తుందని విమర్శించారు.పోరాడే హక్కును,సమ్మె చేసే హక్కును,వేతనాల కోసం బేరసారాలడే హక్కులను లేకుండా చేస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు పెట్టుబడుదారులకు దోచిపెట్టడానికి,సింగరేణి బొగ్గు బావులను బడా పెట్టుబడుదారులకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. పనిగంటలను పెంచి శ్రమదోపిడికి పాల్పడే ప్రయత్నాలు ను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి, ప్రభుత్వ రంగాన్ని రక్షించుకోవడానికి ఈ నెల 9వ తేదీన జరగనున్న సమ్మెలో సింగరేణి అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# 5న యాదగిరిగుట్టలో బిఆర్ఎస్ ఆలేరు స్థాయి సమావేశం



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ఈనెల 5వ తేదీన యాదగిరిగుట్టలో ఆలేరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమావేశం జరగనుందని అధిక సంఖ్యలోరాజపేట మండలం నుండి కార్యకర్తలు, నాయకులు, ప్రతినిధులు తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ కోరారు. గురువారం రాజపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5వ, తేదీ ఉదయం 5: 30 గంటలకు మాజీ ఇరిగేషన్ శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా గిరి ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామివారి దర్శనం తదుపరి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ గార్డెన్ లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆదేశం మేరకు ఆలేరు నియోజకవర్గం కార్యకర్తల సమావేశం జరుగుతుందని రాజాపేట మండలం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు రావాలని కోరారు. ఈ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికలకు సందర్భంగా పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని తప్పకుండా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, జలసాధన సమితి అధ్యక్షులు ఎర్రగోకుల జస్వంత్, ఎడ్ల రామచంద్రారెడ్డి, చింతల దాసు, బంగారు రెడ్డి, మాజీ ఎంపీపీ బాలమణి యాదగిరి గౌడ్, ఇప్ప వెంకన్న, వైకుంఠం, మొలుగు సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

# జూలై 14 నుండి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ

* **కొత్త రేషన్ కార్డుల పంపిణీపై మహిళా కాంగ్రెస్ హర్షం**

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : జూలై 14 నుండి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుందని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖా బోయలపల్లి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మహిళా పక్షపాత నిర్ణయానికి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేస్తోంది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పేరుమీదే కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. తక్షణ ప్రయోజనంతో పాటు, మహిళల ఆర్థిక స్వయం సమృద్ధికి దోహదపడే మార్గదర్శక చర్యగా నిలుస్తుందన్నారు. ప్రత్యేకంగా తుంగతుర్తి నియోజకవర్గం నుండే ఈ పథకం ప్రారంభం కావడం మరింత గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి మహిళా కాంగ్రెస్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విధమైన సూత్రప్రాయ, మహిళల ప్రయోజనాన్ని





ముందుంచిన పాలనే ప్రజలకు కావలసిన మార్గమన్నారు. ఇది కేవలం రేషన్ కార్డు కాదు ఇది స్వయం గౌరవానికి సంకేతమన్నారు. రేవంత్ నాయకత్వంలో ప్రజల పాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు.

# భారత్ టుడే రిపోర్టర్ శ్రీనివాస్ ను పరామర్శించిన తెలంగాణా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా

యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, భారత్ టుడే స్టాఫ్ రిపోర్టర్ భువనగిరి శ్రీనివాస్ తండ్రి లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైనారు. గురువారం రోజున వారి ఇంటికి వెళ్లి పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పించిన



తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా వారితో పాటు యాదగిరిగుట్ట టీజేయు మండల అధ్యక్షులు రాజు, సీనియర్ జర్నలిస్టు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# కొవిడ్ టీకాలపై ఆందోళన.. స్పందించిన ఎయిమ్స్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్

* ఆకస్మిక మరణాలకు టీకాలకు సంబంధం లేదన్న నిపుణులు
* కర్ణాటక సీఎం వ్యాఖ్యలతో మొదలైన చర్చ
* టీకాలు తీసుకున్నవారికే గుండెపోటు ముప్పు తక్కువన్న ఎయిమ్స్
* ఐసీఎంఆర్, కేంద్ర ప్రభుత్వ అధ్యయనాల్లోనూ ఇదే విషయం వెల్లడి

కొవిడ్19 టీకాల భద్రతపై మరోసారి తలెత్తిన సందేహాలను వైద్య నిపుణులు, టీకా తయారీ సంస్థలు ఖండించాయి. ఇటీవలి కాలంలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాల, గుండెపోటులకు వ్యాక్సిన్‌లకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశాయి. ఈ విషయంలో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), ఎయిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన రెండు వేర్వేరు అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని ధృవీకరించాయని నిపుణులు గుర్తు చేశారు. కర్ణాటకలోని హసన్ జిల్లాలో నెల రోజుల వ్యవధిలో సుమారు 20 మంది గుండె సంబంధిత సమస్యలతో మరణించడంతో, ఆ మరణాలకు కొవిడ్ టీకాలే కారణం కావొచ్చంటూ అనుమానాలున్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ టీకా తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్






ఇండియా, ఎయిమ్స్ వైద్యులు, కేంద్ర ఆరోగ్య శాఖ దీనిపై స్పష్టతనిచ్చాయి. ఈ అంశంపై ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా మాట్లాడుతూ, "యువతలో ఆకస్మిక మరణాలపై ఇప్పటికే లోతైన అధ్యయనాలు జరిగాయి. వ్యాక్సిన్లకు, గుండెపోటు మరణాలకు సంబంధం ఉన్నట్లు ఏ పరిశోధనలోనూ వెల్లడి కాలేదు. అన్ని ఔషధాల మాదిరిగానే వీటికి కొన్ని స్వల్ప దుష్ప్రభావాలు ఉండొచ్చు కానీ, ప్రాణాంతకం కాదు" అని వివరించారు. ఎయిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఐసీఎంఆర్, ఎయిమ్స్ అధ్యయనాల ప్రకారం కొవిడ్ టీకాలు తీసుకున్న వారికి ఆకస్మిక గుండెపోటు ముప్పు తక్కువగా ఉన్నట్లు తేలింది. వ్యాక్సిన్ వల్ల ప్రయోజనమే తప్ప హాని లేదని స్పష్టంగా రుజువైంది" అని ఆయన తెలిపారు. యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు వారి జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే ప్రధాన కారణమని, వ్యాక్సిన్‌లు కాదని కేంద్ర వైద్యఆరోగ్య శాఖ కూడా తేల్చి చెప్పింది. దేశీయంగా తయారైన టీకాలు సురక్షితమైనవని, వాటి పనితీరు సమర్థంగా ఉందని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం అధ్యయనాలు వెల్లడించాయని పేర్కొంది.

## 'ఇంధనం నిషేధం'పై దిల్లీ వెనకడుగు.. పాత వాహనదారులకు ఊరట

కాలం చెల్లిన వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిషేధించాలని తీసుకున్న నిర్ణయంపై దిల్లీ సర్కార్ వెనకడుగు వేసింది. పాత వాహనాలను గుర్తించి వాటికి ఇంధనం నిలిపివేసే వ్యవస్థ ప్రస్తుత పరిస్థితుల్లో ఆచరణలో సాధ్యం కాదని పేర్కొంది. ఇందుకు అనేక సాంకేతిక సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రారంభించిన కార్యక్రమాన్ని తక్షణమే నిలిపివేయాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజిమెంట్‌కు లేఖ రాసింది. దీంతో దేశ రాజధానిలోని పాత వాహనదారులకు భారీ ఊరట కలిగినట్లయ్యింది. ''కాలం చెల్లిన వాహనాలకు ఇంధనం నిలిపివేసే ఆదేశాల అమలును తక్షణమే నిలిపివేయాలని కమిషన్‌ను కోరుతున్నాం. ఎన్‌సీఆర్ వ్యాప్తంగా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేవరకు దీన్ని నిలిపివేయాలి. వాయు నాణ్యతను మెరగుపరిచేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుంది'' అని సీఏక్యూఎంకు రాసిన లేఖలో దిల్లీ పర్యావరణశాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా పేర్కొన్నారు. ప్రస్తుత



పరిస్థితుల్లో 'ఇంధనం నిలిపివేత' ఆచరణలో సాధ్యం కాదన్నారు. దేశ రాజధానిలో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. కాలం చెల్లిన వాహనాలకు బంకుల్లో ఇంధనం పోయకూడదని నిర్ణయించింది. 10 ఏళ్లు పైబడిన డీజిల్, 15 ఏళ్లు పైబడిన పెట్రోల్ వాహనాలకు బంకుల్లో ఇంధనం నిలిపివేయాలన్న ఈ నిర్ణయం జులై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో పునరాలోచనలో పడిన దిల్లీ సర్కార్.. కొత్త విధానాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## బ్యాంకు ఖాతా తెరవాలంటే ఆధార్ అవసరమా? బాంబే హైకోర్టు ఏమన్నదంటే...!

* బ్యాంకు ఖాతా తెరవడానికి ఆధార్ తప్పనిసరి కాదు
* బాంబే హైకోర్టు కీలక తీర్పు వెల్లడి
* ఆధార్ అడిగి ఆలస్యం చేసిన బ్యాంకుకు ఎదురుదెబ్బ
* బాధిత కంపెనీకి రూ.50,000 నష్టపరిహారం చెల్లించాలని ఆదేశం
* ఆధార్ వినియోగం ప్రజల ఇష్టప్రకారమే జరగాలని స్పష్టీకరణ
* పుట్టస్వామి కేసు తీర్పును ప్రస్తావించిన న్యాయస్థానం

బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాలని ఖాతాదారులను బలవంతం చేయకూడదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ఆధార్ వివరాలు ఇవ్వలేదన్న కారణంతో ఓ కంపెనీకి ఖాతా తెరవడంలో జాప్యం చేసిన బ్యాంకుకు




రూ.50,000 జరిమానా విధిస్తూ కీలక తీర్పు ఇచ్చింది. ఆధార్ వినియోగం అనేది పౌరుల స్వచ్ఛంద నిర్ణయమని, దాన్ని తప్పనిసరి చేయడం గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని కోర్టు తేల్చిచెప్పింది. ఓ సంస్థ బ్యాంకు ఖాతా తెరిచేందుకు దరఖాస్తు చేసుకోగా, బ్యాంకు అధికారులు ఆధార్ వివరాల కోసం పట్టుబట్టారు. ఆ సంస్థ ప్రత్యామ్నాయంగా ఇతర గుర్తింపు పత్రాలు (కేవైసీ) అందించినప్పటికీ, బ్యాంకు అంగీకరించలేదు. దీనివల్ల ఖాతా తెరుచుకోవడం ఆలస్యమై, తమ కార్యకలాపాలకు అంతరాయం కలిగి ఆర్థికంగా నష్టపోయామని సదరు కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బ్యాంకు చర్యలను చట్టవిరుద్ధమని పేర్కొంది. జస్టిస్ కేఎస్ పుట్టస్వామి కేసులో 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీల కోసం మాత్రమే ఆధార్‌ను ఉపయోగించాలని, ప్రైవేటు సేవలకు దీన్ని తప్పనిసరి చేయరాదని ఆ తీర్పులో స్పష్టంగా ఉందని గుర్తుచేసింది. ఇతర కేవైసీ పత్రాలు అందుబాటులో ఉన్నప్పుడు ఆధార్ కోసం పట్టుబట్టడం ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని కోర్టు అభిప్రాయపడింది. ఖాతా తెరవడంలో ఆలస్యం చేసి కంపెనీకి నష్టం కలిగించినందుకు గాను, ఆ బ్యాంకు రూ.50,000 నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పు, కేవైసీ నిబంధనలను రాజ్యాంగబద్ధంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఆర్థిక సంస్థలకు గుర్తు చేస్తోంది.

## భాజపాతో 'చేయి'కలిపింది.. కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు: కేజ్రీవాల్



అహ్మదాబాద్: కాంగ్రెస్‌తో తమకు పొత్తు లేదని ఆప్ జాతీయ కన్వీనర్ అర్విండ్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో అధికార భాజపాకు కాంగ్రెస్ సహకరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ సారథ్యంలో విపక్ష పార్టీలతో ఏర్పాటైన 'ఇండియా' కూటమి కేవలం గతఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ఉద్దేశించింది మాత్రమేనన్నారు. గురువారం ఆయన అహ్మదాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 2027లో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలు ఇప్పుడు భాజపా, కాంగ్రెస్‌లను కాకుండా ఆప్‌వైపే చూస్తున్నారన్నారు. ''కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు. ఒకవేళ ఏదైనా పొత్తు ఉందనుకుంటే.. విశావదర్ ఉప ఎన్నికల్లో వాళ్లెందుకు మాపై పోటీ చేశారు? మమ్మల్ని ఓడించాలని చూశారు. ఓట్లు చీల్చి ఆప్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌ను భాజపా పంపించింది. కాంగ్రెస్ విఫలం కావడంతో భాజపా వారిని చీవాట్లు కూడా పెట్టింది. 'ఇండియా' కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే. ఇప్పుడు మా వైపు నుంచి ఎలాంటి పొత్తు లేదు'' అన్నారు. ఇటీవల గుజరాత్‌లోని విశావదర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ నేత గోపాల్ ఇటాలియ విజయం సాధించిన విషయం తెలిసిందే. భాజపా అభ్యర్థి కిరీట్ పటేల్‌పై 17వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి నితిన్ రణ్‌పారియాకు కేవలం 5501 ఓట్లు మాత్రమే వచ్చాయి.

## ఆ ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను మోసుకెళ్లాల్సిందే.. రంగంలోకి బ్రిటన్ గ్లోబ్‌మాస్టర్..!

బ్రిటన్‌కు చెందిన శక్తిమంతమైన ఫైటర్ జెట్ ఎఫ్35బి విమానం ఒకటి మొరాయించి దాదాపు 20 రోజులుగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీన్ని మరమ్మతు చేసేందుకు యూకే నుంచి నిపుణుల బృందం వచ్చినా ఫలితం కన్పించట్లేదు. దీంతో బ్రిటిష్ నేవీ ప్రత్యామ్నాయ చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. విమానాన్ని ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం అతిపెద్ద సీ17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానాన్ని భారత్‌కు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న చోటనే దీన్ని మరమ్మతు చేసేందుకు వీలుపడకపోవడంతో.. ఫైటర్‌జెట్ భాగాలను విడదీసి తరలించేలా ఏర్పాట్లు చేస్తోందట. ఇక, ఇన్ని రోజుల పాటు యుద్ధ విమానాన్ని ఎయిర్‌పోర్టులో నిలిపినందుకు గానూ.. పార్కింగ్, హ్యాంగర్ బకాయిలను భారత్‌కు చెల్లిస్తామని యూకే నేవీ తెలిపినట్లు సమాచారం. అయితే, అది ఎంత మొత్తం అనేది ప్రభుత్వం నిర్ణయించనుంది. గత నెల ఇండో



యూకే నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్35బీ విమానంలో సమస్య తలెత్తింది. దీంతో జూన్ 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరతతో దీన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య ఉన్నట్లు ఆ తర్వాత యూకే అధికారులు వెల్లడించారు. దీనికి మరమ్మతులు చేయడానికి అదే రోజు రాత్రి ఏడబ్ల్యూ101 మెర్లిన్ హెలికాప్టర్‌లో నిపుణులు వచ్చారు. వారు మరమ్మతులు నిర్వహించినా విమానం మొరాయించింది. అప్పటి నుంచి దాదాపు 20 రోజులుగా ఈ ఫైటర్‌జెట్ ఎయిర్‌పోర్టులోనే ఉంది. దీంతో యూకే నుంచి దాదాపు 40 మంది స్పెషలిస్టుల బృందాన్ని పిలిపించారు. ఎఫ్35 అనేది 5వ తరం స్టెల్త్ ఫైటర్‌జెట్. ఈ యుద్ధ విమానానికి షార్ట్ టేకాఫ్‌తో పాటు వర్టికల్ ల్యాండింగ్ సామర్థ్యం ఉంది. అమెరికా సహా అతికొద్ది దేశాల సైన్యం వద్దే ఈ ఫైటర్ జెట్ ఉంది.

## కొవిడ్ వ్యాక్సిన్లపై సిద్ధరామయ్య వ్యాఖ్యలు.. బయోకాన్ చీఫ్ కౌంటర్

హసన్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న మరణాలకు కొవిడ్ టీకాల ప్రభావమే కారణం కావొచ్చని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అనుమానం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. తాజాగా బయోకాన్ చీఫ్ కిరణ్ మంజుదార్ షా ఈ వ్యాఖ్యలపై స్పందించారు. సిద్ధరామయ్య అనుమానాలను తోసిపుచ్చిన ఆమె.. సీఎం వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయన్నారు. 'భారత్‌లో అభివృద్ధి చేసిన కొవిడ్19 వ్యాక్సిన్‌లు అత్యవసర వినియోగ అధికార చట్టం కింద ఆమోదించడం జరిగింది. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగానే ఇది తయారైంది. ఈ వ్యాక్సిన్‌లపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయొద్దు. ఇవి లక్షల మంది ప్రాణాలను కాపాడాయి. ప్రజలపై దుష్పరిణామాలు సంభవించిన కేసులు చాలా అరుదుగా చోటుచేసుకున్నాయి. ఈ వ్యాక్సిన్లపై నిందలు వేయడం మానేసి దాని అభివృద్ధి వెనక ఉన్న సైన్స్‌ను గుర్తించడం చాలా ముఖ్యం' అని ఆమె రాసుకొచ్చారు. గత నెలలోనే హసన్ జిల్లాలో గుండెపోటుతో 20 మందికి పైగా మరణించడంపై సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మరణాలకు కచ్చితమైన కారణాన్ని గుర్తించి పరిష్కారాలు కనుగొనేందుకు ఒక కమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పది రోజుల్లో దీనిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొవిడ్ వ్యాక్సిన్లను ప్రజలకు తొందరపాటుగా ఆమోదించడం, పంపిణీ చేయడం కూడా మరణాలకు కారణం కావొచ్చని అనుమానం వ్యక్తంచేశారు. ఇటీవల పలు అధ్యయనాలు ఈ వ్యాక్సిన్లతో గుండెపోటు పెరుగుదలకు





కారణమవుతాయని వెల్లడించాయన్నారు. దీనిపై కూడా సమగ్ర అధ్యయనం చేయాలని కమిటీని ఆదేశించినట్లు తెలిపారు. ఇదిలాఉండగా.. యువత ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్ప, కొవిడ్ వ్యాక్సిన్ కాదని బుధవారం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్పష్టంచేసింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), దిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన అధ్యయనాల్లో ఈ విషయం తేలిందని పేర్కొంది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది.



## దలైలామా వారసుడి ఎంపిక..
# చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చిన భారత్

* **వారసుడి ఎంపికకు తమ ఆమోదం తప్పనిసరి అన్న చైనా**
* **చైనా డిమాండ్‌ను తీవ్రంగా ఖండించిన భారత ప్రభుత్వం**
* **వారసుడిని ఎన్నుకునే హక్కు దలైలామాకు మాత్రమే ఉందని స్పష్టీకరణ**
* **ఈ విషయంలో ఇతరులకు జోక్యం చేసుకునే హక్కు లేదన్న కేంద్రమంత్రి రిజిజు**
* **తన వారసుడి ఎంపిక ప్రక్రియపై స్వయంగా ప్రకటన చేసిన దలైలామా**

టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామాకు, ఆయన సంస్థకు మాత్రమే ఉంటుందని, ఈ విషయంలో ఇతరుల జోక్యానికి తావులేదని గురువారం స్పష్టం చేసింది. చైనా డిమాండ్‌ను తోసిపుచ్చుతూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టుకు మాత్రమే ఉందని దలై లామా బుధవారం ప్రకటించారు. ఈ ప్రక టన వెలువడిన కొన్ని గంటల్లోనే చైనా స్పందించింది. తదుపరి దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర తప్పనిసరి అని, తమ విధానాలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేసింది. చైనా వాదనపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. "దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం విషయంలో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనే ఉంటుంది. దలైలామా స్థానం కేవలం టిబెటన్లకే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనది" అని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తేల్చిచెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో ప్రారంభమైన దలైలామా 90వ పుట్టినరోజు వేడుకలకు భారత్ తరపున కిరణ్ రిజిజు హాజరుకానున్నారు. 1950లో టిబెట్‌ను ఆక్రమించుకున్న చైనా, అప్పటి నుంచి ఆ ప్రాంతంపై పూర్తి నియంత్రణ కోసం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా తమకు అనుకూలంగా ఉండే వ్యక్తిని దలైలామా వారసుడిగా నియమించాలని ఎప్పటినుంచో వ్యూహాలు పన్నుతోంది. చైనా ఎత్తుగడలను గమనించిన దలైలామా, తన వారసుడి ఎంపికపై స్పష్టతనివ్వగా, ఆయనకు భారత్ బాసటగా నిలుస్తోంది.

## హమాస్‌ను తుడిచిపెడతాం..
# వెనక్కి తగ్గేదే లేదు: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

* **గాజాలో 'హమస్థాన్' ఏర్పాటు కానివ్వబోమని స్పష్టీకరణ**
* **60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ఓకే చెప్పిందన్న డొనాల్డ్ ట్రంప్**
* **యుద్ధం శాశ్వతంగా ఆపితేనే బందీల విడుదల అని హమాస్ ప్రకటన**
* **ఆయుధాలు వదిలి లొంగిపోవాలంటూ ఇజ్రాయెల్ కఠిన షరతు**

గాజాలో హమాస్‌ను సమూలంగా నిర్మూలించడమే తమ అంతిమ లక్ష్యమని, ఆ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు



తేల్చిచెప్పారు. కాల్పుల విరమణ కోసం అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "గాజాలో హమాస్ ఉండదు, హమస్థాన్ ఉండదు. ఆ సంస్థను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం" అని ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన స్పష్టం చేశారు. గాజాలో 60 రోజుల పాటు కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ సూత్రప్రాయంగా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో నెతన్యాహు వైఖరి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈజిప్ట్, ఖతార్ దేశాల మధ్యవర్తిత్వంతో జరుగుతున్న సంధి చర్చలను హమాస్ పరిశీలిస్తున్న సమయంలోనే ఇజ్రాయెల్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు, కాల్పుల విరమణకు తాము సిద్ధమేనని హమాస్ ప్రకటించింది. అయితే, గాజాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని శాశ్వతంగా ముగించి, తమ సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని షరతు విధించింది. అలా చేస్తే తమ వద్ద బందీలుగా ఉన్న మిగిలిన 50 మందిని విడుదల చేస్తామని హమాస్ ప్రతినిధి తాహెర్ అల్‌నును తెలిపారు. అయితే, హమాస్ ప్రతిపాదనను ఇజ్రాయెల్ తిరస్కరించింది. హమాస్ తమ ఆయుధాలను అప్పగించి, పాలస్తీనాను విడిచి వెళ్లడానికి అంగీకరిస్తేనే 60 రోజుల కాల్పుల విరమణకు ఒప్పుకుంటామని స్పష్టం చేసింది. యుద్ధం ముగిశాక గాజాలో హమాస్ ఉనికి కనిపించడానికి వీల్లేదని నెతన్యాహు ప్రభుత్వం చెబుతోంది.

# గాల్లో ఉండగానే విమానం రెక్క భాగం ఊడిపడింది..
## అమెరికాలో తప్పిన ప్రమాదం

* **అమెరికాలో డెల్టా విమానానికి తప్పిన పెను ప్రమాదం**
* **ల్యాండింగ్ సమయంలో ఊడిపడ్డ రెక్కలోని భాగం**
* **109 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది సురక్షితం**
* **నార్త్ కరోలినాలో రహదారిపై పడిన విడిభాగం**
* **ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్**

అమెరికాలో డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానానికి పెను ప్రమాదం తప్పింది. 115 మంది



ప్రయాణికులతో వెళుతున్న విమానం ల్యాండ్ అవుతుండగా దాని రెక్కలోని ఒక భాగం ఊడి కింద రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తు ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనను అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) ధ్రువీకరించింది. మంగళవారం రాత్రి డెల్టా ఫ్లైట్ 3247 బోయింగ్ 737900 విమానం అట్లాంటా నుంచి నార్త్ కరోలినాలోని రెలీదర్హం విమానాశ్రయానికి బయలుదేరింది. విమానంలో 109 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ప్రయాణం సాఫీగానే సాగినా, రెలీ విమానాశ్రయంలో ల్యాండింగ్ సమయంలో సమస్య తలెత్తింది. విమానం ఎడమ రెక్క వెనుక భాగంలో ఉండే 'ఫ్లాప్'కు సంబంధించిన ఒక విడిభాగం ఊడి కిందపడింది. అయినప్పటికీ పైలట్ చాకచక్యంగా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ల్యాండింగ్ తర్వాత విమానాన్ని తనిఖీ చేయగా రెక్క భాగం ఒకటి కనిపించకపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గాలింపు చేపట్టగా ఆ విడిభాగం విమానాశ్రయ సమీపంలోని ఒక రహదారిపై లభ్యమైనట్లు ఎఫ్ఏఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని, దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని డెల్టా ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. విమానాలు టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేటప్పుడు వాటి వేగాన్ని, గమనాన్ని నియంత్రించడానికి ఫ్లాప్స్ అత్యంత కీలకంగా పనిచేస్తాయి.

## వివో నుంచి డబుల్ ధమాకా..
# ఒకే రోజు కాంపాక్ట్, ఫోల్డబుల్ ఫోన్లు

చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో (Vivo) డబుల్ సర్‌ప్రైజ్‌కు సిద్ధమైంది. చేతిలో ఇమిడిపోయే కాంపాక్ట్ ఫోన్‌తో పాటు ఫోల్డబుల్ ఫోన్‌ను ఈ నెలలోనే లాంచ్ చేయనుంది. వివో ఎక్స్ ఫోల్డ్ 5, వివో ఎక్స్200 ఎఫ్ఈ పేర్లతో రెండు కొత్త మొబైల్ ఫోన్‌లను తీసుకురానుంది. వీటిని ఇప్పటికే చైనాలో విడుదల చేయగా.. ఈ నెల 14న భారత్‌లో విడుదల చేయనుంది. ఈ ఫోన్‌లు వివో ఇండియా ఈస్టోర్‌లతో పాటు ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులోకి రానున్నాయి.

### వివో ఎక్స్ 200 ఎఫ్ఈ

ఈ ఫోన్ 6.31 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లేతో రానుంది. Zeissతో అభివృద్ధి చేసిన 50 ఎంపీ మెయిన్ సెన్సర్, 50 ఎంపీ టెలిఫొటో సెన్సర్, 8




ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. దీనిలో మీడియాటెక్ 9300+ ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్ ఓఎస్ 15తో పనిచేస్తుంది. 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 90W ఫాస్ట్ చార్జింగ్ సదుపాయం ఉండబోతోంది. ఇది అంబర్ ఎల్లో, ఫ్రాస్ట్ బ్లూ, లక్స్ గ్రే రంగుల్లో లభిస్తుంది. ధర, ఇతర వివరాలు విడుదల సమయంలో వెల్లడికానున్నాయి.

### వివో ఎక్స్ ఫోల్డ్ 5

వివో నుంచి ఈ ఏడాది ఫోల్డబుల్ ఫోన్ రానుంది. అదే వివో ఎక్స్‌ఫోల్డ్ 5. ఇందులో వెనుకవైపు Zeissbacked ట్రిపుల్ రేర్ కెమెరా యూనిట్ ఇచ్చారు. ఇందులో 50 మెగాపిక్సెల్ సోనీ ఐఎంఎక్స్921 ప్రధాన కెమెరా ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ రాబోతోంది. 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్882 టెలిఫొటో షూటర్‌తో వస్తుంది. 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 80W ఫాస్ట్ వైర్డ్ చార్జింగ్ సదుపాయం ఉంటుంది. టైటానియం గ్రే, వైట్, గ్రీన్ కలర్‌ల్లో రానుంది.

## ఐటీలోనే జీతాలెక్కువ..
# ఈ నగరాల్లో వేగంగా వేతనాల పెంపు

ఎన్ని విస్తృత రంగాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఐటీకి ఉండే క్రేజ్ మాత్రం ప్రత్యేకమే. కొత్త టెక్నాలజీ, హై డిమాండ్‌తో పాటు ఆకర్షణీయ సదుపాయాలు ఉండటంతో చాలా మంది ఈ రంగాన్ని ఎంచుకునేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అంతేకాదు.. వేతన చెల్లింపుల్లోనూ ఐటీనే టాప్‌లో ఉందట. మన దేశంలో ఎక్కువ జీతాలు ఇస్తున్నది ఈ రంగంలోనే అని తాజా సర్వే ఒకటి వెల్లడించింది. దేశవ్యాప్తంగా పలు విభాగాల్లో వేతనాల చెల్లింపులపై జాబ్ సెర్చ్, హైరింగ్ ప్లాట్‌ఫామ్ 'ఇండీడ్ పేమ్యాప్' సర్వే నిర్వహించింది. దాని ప్రకారం.. టెక్ రంగంలో ఫ్రెషర్లు నెలకు రూ.28,600 వరకు అందుకుంటున్నట్లు తేలింది. ఇక, ఐదు నుంచి ఏడేళ్ల అనుభవం కలిగిన టెక్ ఉద్యోగులు దాదాపు రూ.68,900 వరకు వేతనం పొందుతున్నారట. డిజిటల్, ఏఐ ఆధారిత ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంలో వేతనాల చెల్లింపులు ఎక్కువగా ఉంటున్నట్లు ఇండీడ్ నివేదిక వెల్లడించింది. ఇక, టెక్ తర్వాత తయారీ, టెలికాం రంగాల్లో ఆకర్షణీయ వేతనాలు ఉన్నట్లు సర్వే తేల్చింది. ఈ రంగాల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగుల జీతాలు నెలకు రూ.28100 నుంచి రూ.28300 వరకు ఉన్నాయి. అదే 58 ఏళ్ల అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ అయితే నెలవారీ



వేతనం రూ.67,700 నుంచి రూ.68,200 వరకు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. విభాగాల పరంగా చూస్తే.. సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, హెచ్‌ఆర్ ఇంజినీరింగ్‌లో ఎంట్రీ లెవల్ ఉద్యోగుల నెల జీతం రూ.25000 నుంచి రూ.30,500 వరకు ఉంది. 58 ఏళ్ల అనుభవం ఉన్న ప్రొడక్ట్, ప్రాజెక్ట్ మేనేజర్లయితే వారి నెలవారీ వేతనం దాదాపు రూ.85,500 వరకు ఉన్నట్లు సర్వే తెలిపింది. ఇక.. హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో వేతన పెంపు వేగంగా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా సగటు వేతన పెంపు 15శాతం కంటే ఎక్కువగా ఈ నగరాల్లో ఉద్యోగుల జీతాలు పెరుగుతున్నట్లు నివేదిక తెలిపింది. అయితే, జీతాల పెంపు ఉంటున్నప్పటికీ.. చాలా మంది ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సర్వేలో వెల్లడైంది. తమ జీవనవ్యయంతో పోలిస్తే తమకు వస్తున్న ఆదాయం తక్కువేనని 69శాతం మంది ఉద్యోగులు భావిస్తున్నారట. ముఖ్యంగా దిల్లీ, ముంబయి, పుణె, బెంగళూరు నగరాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఈ అసంతృప్తి ఎక్కువగా ఉన్నట్లు సర్వే తేల్చింది. దేశవ్యాప్తంగా 1311 మంది యజమానులు, 2531 మంది ఉద్యోగులను సర్వే చేసి ఇండీడ్ ఈ నివేదిక రూపొందించింది.




## మళ్లీ టాప్‌లోకి క్రెటా..
# జూన్‌లో అమ్ముడైన టాప్10 కార్లు ఇవే!



ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ హ్యుందాయ్‌కి చెందిన క్రెటా మరోసారి సత్తా చాటింది. జూన్ నెలలో దేశంలో అత్యధికంగా అమ్ముడైన కార్ల జాబితాలో తొలి స్థానం దక్కించుకుంది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో వరుసగా టాప్ సెల్లింగ్ మోడల్‌గా నిలిచిన ఈ కారు.. మే నెలలో మాత్రం నాలుగో స్థానానికి పరిమితమైంది. జూన్‌లో మళ్లీ పుంజుకొని అగ్రస్థానం దక్కించుకుంది. మరోవైపు ఎస్‌యూవీల విక్రయాల జోరు కొనసాగుతున్న వేళ కూడా మారుతీ సుజుకీకి చెందిన డిజైర్, ఎర్టిగా, స్విఫ్ట్ వంటి సెడాన్, ఎంపీవీ, హ్యాచ్‌బ్యాక్‌లు సత్తా చాటడం విశేషం. జూన్ నెలకు సంబంధించి వెల్లడైన డేటా ప్రకారం.. హ్యుందాయ్‌కి చెందిన క్రెటా 15,786 యూనిట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 15,484 యూనిట్లతో మారుతీ సుజుకీ డిజైర్ రెండో స్థానం దక్కించుకోగా.. అదే కంపెనీకి చెందిన బ్రెజ్జా 14,507 యూనిట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఎర్టిగా (14,151), స్విఫ్ట్ (13,2275) టాప్5లో చోటు దక్కించుకున్నాయి. జూన్ నెలలో అమ్ముడైన టాప్10 కార్లలో మారుతీ సుజుకీకి చెందిన ఆరు మోడళ్లు ఉన్నాయి. టాటా మోటార్స్‌కు చెందినవి రెండు చోటు దక్కించుకున్నాయి. హ్యుందాయ్ మోటార్, మహీంద్రా అండ్ మహీంద్రాకు చెందిన ఒక్కో మోడల్ ఈ జాబితాలో ఉన్నాయి. మొత్తంగా 10 సెల్లింగ్ కార్లలో ఎస్‌యూవీ సెగ్మెంట్‌కు చెందినవి ఆరు మోడళ్లు ఉండగా.. హ్యాచ్‌బ్యాక్ నుంచి 2, ఎంపీవీ కేటగిరీ నుంచి ఒకటి, సెడాన్ సెగ్మెంట్ నుంచి ఒకటి ఉన్నాయి.

**హ్యుందాయ్ క్రెటా -15,786**
**మారుతీ సుజుకీ డిజైర్- 15,484**
**మారుతీ సుజుకీ బ్రెజ్జా - 14,507**
**మారుతీ సుజుకీ ఎర్టిగా - 14,151**
**మారుతీ సుజుకీ స్విఫ్ట్- 13,275**
**మారుతీ సుజుకీ వ్యాగనార్ - 12,930**
**మహీంద్రా స్కార్పియో- 12,740**
**టాటా నెక్సాన్- 11,602**
**టాటా పంచ్- 10,446**
**మారుతీ సుజుకీ ఫ్రాంక్స్- 9,815**

## లాభాల స్వీకరణకు దిగిన మదుపరులు..

### నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఉదయం నుంచి మార్కెట్లు లాభాల్లో ట్రేడయినా.. చివరి వరకు కొనసాగించలేకపోయాయి. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు చివరి సెషన్‌లో నష్టాల్లోకి జారుకున్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,540.74 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,850.09 గరిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. 83,850.09 పాయింట్ల కనిష్టానికి చేరింది. చివరకు 170.22 పాయింట్లు పతనమై.. 83,239.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48.10 పాయింట్లు తగ్గి 25,405.30 వద్ద ముగిసింది. అమెరికా, వియత్నాం వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ప్రపంచ మార్కెట్‌లో సానుకూల పవనాలతో భారత మార్కెట్లు సైతం లాభాల్లో మొదలయ్యాయి.

తొలి అర్ధభాగంలో నిఫ్టీ 25,600 పాయింట్లకు చేరింది. అయితే, చివరి గంటలో మదుపరుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. అపోలో హాస్పిటల్స్, హీరో మోటోకార్ప్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఓఎన్‌జీసీ, మారుతి సుజుకీ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే మెటల్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్, టెలికాం సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం క్షీణించాయి. ఫార్మా, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్ 0.3-1 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్‌తో కలిపి విస్తృత సూచీలు వరుసగా మూడో సెషన్‌లో క్షీణించాయి. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ రెండురోజుల పతనాన్ని అధిగమించి 0.5 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 140కి పైగా స్టాకులు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి.

## పతంజలిపై కోర్టుకెక్కిన డాబర్ చ్యవన్‌ప్రాశ్..

### ప్రకటనలు నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశం..




**న్యూఢిల్లీ:** డాబర్ చ్యవన్‌ప్రాశ్‌కు వ్యతిరేకంగా పతంజలి ఆయుర్వేద్ జారీ చేసిన ప్రకటలన్నింటినీ నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కంపెనీ యాడ్స్‌ను ప్రసారం చేయకుండా జస్టిస్ మిని పుష్కర్ణ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తమ కంపెనీ ఉత్పత్తులను పతంజలి కంపెనీ అవమానిస్తోందంటూ డాబర్ కంపెనీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు విచారణ జరిపిన జడ్జి ప్రకటనలు జారీ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ సందర్భంగా ఆయుర్వేద గ్రంథాల్లో పేర్కొన్నట్లుగా తాము మాత్రమే చ్యవన్‌ప్రాశ్ తయారు చేస్తున్నట్లుగా పతంజలి సంస్థ ప్రకటనల్లో పేర్కొంటుందని.. ఇతర సంస్థలు మాత్రం సరైన ఉత్పత్తులు తయారు చేసే పరిజ్ఞానం లేదని ప్రకటనలో పేర్కొంది. అయితే, దీనిపై డాబర్ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. కంపెనీ యాడ్స్‌ను నిలిపివేయడంతో పాటు తమ పరువుకు భంగం కలిగించినందుకు రూ.2కోట్ల పరిహారాన్ని సైతం ఇప్పించాలని కోరింది. కేవలం తమ ఉత్పత్తులే సరైనవని పతంజలి కంపెనీ ప్రకటనల్లో క్లెయిమ్ చేరసుకుంటోందని డాబర్ ఆరోపించింది. డాబర్ కంపెనీ తరఫున న్యాయవాదులు జవహర్ లాలా, మేఘనా కుమార్ విచారణకు హాజరయ్యారు. కోర్టు కేసును జులై 14న మరోసారి విచారించనున్నది. ఇదిలా ఉండగా.. తప్పుదారి పట్టించే ప్రకటనల కేసులో ఇప్పటికే బాబా రామ్‌దేవ్ కోర్టుకు క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. కొవిడ్, ఇతర వ్యాధులను నయం చేయడంలో పతంజలి తప్పుడు ప్రచారం చేరస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

తప్పుదారి పట్టించే ప్రకటనలను ఆపేయాలని సుప్రీంకోర్టు పతంజలిని ఆదేశించింది. అయినా, కంపెనీ ప్రమోషన్స్‌ను ఆపకపోవడంతో పంజతలి కంపెనీపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణను వ్యక్తిగతంగా కోర్టుకు రావాలని ఆదేశించింది. ఆదేశాలు పాటించకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవని హెచ్చరించింది. ఆ తర్వాత బాబా రాందేవ్, బాలకృష్ణ క్షమాపణలు చెప్పారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు కేసు విచారణను ముగించింది. ఇదిలా ఉండగా.. హమ్‌దార్డ్ కంపెనీ 'షర్బత్ జిహాద్'పై బాబా రాందేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయగా.. కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కంపెనీ ఉత్పత్తులపై ఎలాంటి ప్రకటనలు చేయొద్దని మే ఒకటిన ఢిల్లీ హైకోర్టు యోగా గురువును ఆదేశించింది.

## ఏఐ ఎఫెక్ట్.. 2025లో లక్షకుపైగా ఉద్యోగాల కోత



**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా 2019లో మొదలైన ఈ కోతలు.. ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

ఈ ఏడాది కూడా వందలాది కంపెనీలు.. లక్షలాది మంది ఉద్యోగులను తొలగించాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు విడతల వారీగా లేఆఫ్స్ ప్రకటించాయి. ఖర్చుల తగ్గింపు, కంపెనీల పునర్వ్యవస్థీకరణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యాప్తి వంటి కారణాలతో ఈ ఏడాది ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా లక్షకు పైగా టెక్ ఉద్యోగాలకు కోత పడింది. దిగ్గజ ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ కూడా నిన్న వేలాది మందిపై వేటు వేసింది. ప్రధానంగా, గేమింగ్ యూనిట్లలో 9,100 మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోనున్నారు.

### మైక్రోసాఫ్ట్‌లో 9 వేల మందికి ఉద్వాసన

వ్యయ నియంత్రణలో భాగంగా సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీగా ఉద్యోగుల తొలగింపును చేపట్టింది. మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 4 శాతానికి తక్కువ కాకుండా తొలగించాలని నిర్ణయించింది. దీంతో సుమారు 9 వేల మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. ఈ తొలగింపులు, గేమింగ్ విభాగాల్లో ఉండనున్నాయి. గత 18 నెలల కాలంలో మైక్రోసాఫ్ట్ చేపట్టనున్న నాలుగో అతిపెద్ద ఉద్యోగాల కోత ఇదే కావొచ్చని టెక్ వర్గాలు భావిస్తున్నాయి.

కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు.

## శుభ్‌మన్ గిల్ తొలి డబుల్ సెంచరీ




387 బంతుల్లో 269 పరుగులతో అదరగొట్టిన గిల్

తొలి ఆసియా కెప్టెన్‌గా రికార్డు!

శ్రీలంక ఆటగాడు తిలకరత్నే దిల్షాన్ రికార్డు బ్రేక్

దిగ్గజ కెప్టెన్ల జాబితాలో చోటు దక్కించుకున్న యువ కెప్టెన్

రెండో రోజు భారత్‌దే పైచేయి..

మిడిలార్డర్‌పైనే ఇంగ్లండ్ ఆశలన్నీ..!

**ఎడ్జ్‌బాస్టన్:** ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో భారత పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(269) డబుల్ సెంచరీతో భారీ స్కోర్ చేసిన టీమిండియా అనంతరం ఇంగ్లండ్ మూడు వికెట్లు తీసింది. ఓపెనర్ డకెట్, ఓలీ పోప్‌ను డకౌట్ చేసిన ఆకాశ్ దీప్(2-36) ఆతిథ్య జట్టును దెబ్బ కొట్టగా.. సిరాజ్ సైతం విజృంభించి డేంజరస్ జాక్ క్రాలే(19)ను వెనక్కి పంపాడు. టాపార్డర్ వైఫల్యంతో కష్టాల్లో పడిన జట్టును జో రూట్(18 నాటౌట్), హ్యారీ బ్రూక్(30 నాటౌట్) ఆదుకున్నారు. ఆఖరి నలభై నిమిషాలు వికెట్ కాపాడుకున్న ఈ జోడీ రన్స్ రాబట్టింది. దాంతో, రెండో రోజు ఆట ముగిసే సరికి స్టోక్స్ సేన 3 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 510 రన్స్ వెనకబడి ఉంది.

ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌కు బిగ్ షాక్. భారత పేసర్ ఆకాశ్ దీప్ (2-12) నిప్పులు చెరగడంతో ఆ జట్టు రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఆకాశ్ ఒకే ఓవర్లో తొలుత బెన్ డకెట్(0)ను ఔట్ చేసి ఇండియాకు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత బంతికే తొలి టెస్టు సెంచరీ వీరుడు ఓలీ పోప్(0)ను గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేరాడు. రాహుల్ క్యాచ్ అందుకోవడంతో.. 13 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది ఆతిథ్య జట్టు.

### గిల్ చిరస్మరణీయ డబుల్..

అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ రెండో టెస్టులో ఆతిథ్య ఇంగ్లండ్‌కు షాకిస్తూ భారత జట్టు భారీ స్కోర్ చేసింది. లీడ్స్‌లో ఎదురైన ఓటమి నుంచి తేరుకొని.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(269) చరిత్రలో నిలిచిపోయే ఇనన్నింగ్స్ ఆడగా .. రవీంద్ర జడేజా(89), ఓపెనర్ యశస్వీ జైస్వాల్(87) కొండంత పరుగులో భాగమయ్యారు. రెండో రోజు తొలి సెషన్ నుంచి ఇంగ్లండ్ బౌలర్లకు కొరకుడుపడని కొయ్యలా మారిన గిల్ ద్విశతకంతో కదం తొక్కిన వేళ టీమిండియా పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే.. ఆరొందలకు మరో 13 పరుగులు దూరంలోనే ఆగిపోయింది.

లీడ్స్‌లో మాదిరిగానే బెన్ స్టోక్స్ సేన టెయిలెండర్లను చుట్టేసింది. గిల్ పెవిలియన్ చేరడమే ఆలస్యం ఆకాశ్ దీప్(6) పెద్ద షాట్‌కు యత్నించి బెన్ డకెట్‌కు సులువైన క్యాచ్ ఇచ్చాడు. బషీర్ బౌలింగ్‌లో సిరాజ్(8) పిచ్ వదిలి షాట్ ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. దాంతో, 587 వద్ద భారత జట్టు తొలి ఇన్నింగ్స్ ముగిసింది. మరో విషయం ఏంటంటే.. ఈమధ్య కాలంలో బజ్ బాల్ ఆటను అలవర్చుకున్న ఇంగ్లండ్ ఒక ఇన్నింగ్స్‌లో ఇన్నేసి పరుగులు ఇవ్వడం ఇదే ప్రథమం.

ఐదు టెస్టుల సిరీస్‌ను ఓటమితో ఆరంభించిన భారత జట్టు.. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో పంజా విసిరింది. తొలి రోజు ఆధిపత్యాన్ని రెండో రోజు కొనసాగిస్తూ ఇంగ్లండ్ బౌలర్లకు దిమ్మతిరిగేలా చేసింది టీమిండియా. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(269) క్రీజులో పాతుకుపోయి బౌండరీలు బాదినట్టుగా రికార్డులు బద్ధలు కొడుతుంటే స్టోక్స్ సేన చేష్టలుడిగి చూస్తుండిపోయింది. గిల్ ఒక్కడే సగం స్కోర్ చేయగా జడేజా, యశస్వీలు బౌలర్లకు చుక్కలు చూపించగా భారత్ 587 రన్స్ కొట్టింది. ఇంగ్లండ్ బౌలర్లలో బషీర్ మూడు వికెట్లు తీయగా.. టంగ్, వోక్స్‌లు రెండేసి వికెట్లు పడగొట్టారు.

## ఆగస్టులో ఆసియా కప్

### భారత్‌కు రానున్న పాకిస్థాన్ జట్టు..!

**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రీడా సంబంధాలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇరు దేశాల బోర్డులు అంతర్జాతీయ టోర్నీల్లోనే ఒకే గ్రూప్‌లో ఆడేందుకు నిరాకరించడమే అందుకు కారణం. ఈ క్రమంలోనే భారత్ ఈ ఏడాది ఆతిథ్యమిస్తున్న హాకీ ఆసియా కప్‌లో పాక్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. అయితే.. ఆ దేశ క్రీడా శాఖ మంత్రిత్వ శాఖ మాత్రం తమ జట్టును ఇండియాకు పంపించేందుకు సిద్ధమవుతోంది.



హాకీ ఆసియా కప్ టోర్నీ భారత్ వేదికగా ఆగస్ట్ 27న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 27 వరకూ జరుగబోయే ఈ ఈవెంట్‌కు హాకీ ఇండియా సన్నాహకాలు చేస్తోంది. టోర్నమెంట్ సమీపిస్తున్న వేళ గురువారం పాకిస్థాన్ క్రీడా మంత్రిత్వ శాఖ భారత్‌కు తమ జట్టును పంపేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పింది. 'భారత్ వేదికగా జరుగబోయే పలు దేశాల టోర్నీలో మేము ఏ జట్టుకు వ్యతిరేకం కాదు. ఇదేమీ ద్వైపాక్షికి సిరీస్ కాదు. అంతర్జాతీయ క్రీడా నిబంధనలు మాకు తెలుసు. అందుకే మా జట్టును పోటీలకు పంపేందుకు అడ్డు చెప్పం. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం జరుగుతున్నా సరే ఆ దేశాల జట్లు పలు వేదికలపై పోటీ పడ్డాయి. కాబట్టి.. పాక్ జట్టుకు ఆసియా కప్ ఆడేందుకు అనుమతిస్తున్నాం' అని పాక్ క్రీడా శాఖ సన్నిహిత వర్గాలు తెలిపాయి. అయితే.. సెప్టెంబర్‌లో టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఆసియా కప్‌లో దాయాదులు తలపడుతాయా? అనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయంపై బీసీసీఐ అభిప్రాయం వెలిబుచ్చాకే తమ మాట చెప్పాలని క్రీడా మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్టు సమాచారం.



## బాలాజీ జోడీ ముందంజ

### తొలి రౌండ్‌లోనే బోపన్న నిష్క్రమణ..!

**లండన్:** వింబుల్డన్‌లో భారత స్టార్స్ ఆశలు రేకెత్తిస్తున్నారు. పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ ముందంజ వేశాడు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో శ్రీరామ్- మిగెల్ రెయ్స్(మెక్సికో) ద్వయం అమెరికా జంటను చిత్తు చేసింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోరులో లెర్నర్ థియెన్, అలెగ్జాండర్ కొవసెవిక్ ద్వయంపై 6-4, 6-4తో జయకేతనం ఎగురవేసింది. దాంతో, ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌కు దూసుకెళ్లిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు శ్రీరామ్. లండన్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో యుకీ బాంబ్రీ, రిత్విక్ బొల్లిపల్లిలు రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఇప్పుడు శ్రీరామ్ కూడా తొలి రౌండ్ దాటడంతో ఈ ముగ్గురిలో ముందడుగు వేస్తారో చూడాలి. రెండో రౌండ్‌లో శ్రీరామ్ ద్వయం నాలుగో సీడ్‌తో తలపడనుంది.

అయితే.. భారత లెజెండరీ ఆటగాడు రోహన్ బోపన్న మాత్రం అనూహ్యంగా నిష్క్రమించాడు. అనుభవజ్ఞుడైన అతడు అలవోకగా గెలుస్తాడనుకుంటే తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. బెల్జియం ఆటగాడు సాండర్ జెల్లీతో ఆడిన బోపన్న జర్మనీ జంట చేతిలో 6-3, 6-4తో పరాజయం పాలయ్యాడు.

## సెమీఫైనల్లో హితేశ్, సాక్షి..

### భారత్ ఖాతాలో ఐదో పతకం..!




**బ్రెజిల్:** వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత బృందం అదరగొడుతోంది. ఇప్పటికే మూడు పతకాలు ఖారారు కాగా గురువారం నాడు మరో ఇద్దరు బాక్సర్లు దేశం గర్వపడేలా చేశారు. పురుషుల 70 కిలోల విభాగంలో హితేశ్ గులియా, మహిళల 54 కిలోల కేటగిరీలో సాక్షి సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకం ఖాయం చేశారు. కజకిస్థాన్‌లోని అస్తానా వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో.. ఈ ఏడాది ఆరంభంలో బ్రెజిల్ గడ్డపై స్వర్ణం సాధించిన హితేశ్ ధాటికి స్థానిక బాక్సర్ అల్మాజ్ ఒరొజ్‌బెకొవ్ చిత్తయ్యాడు.





గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత బాక్సర్ 5-0తో అల్మాజ్‌ను మట్టికరిపించి పసిడి పోరుకు మరింత చేరువయ్యాడు. ఇక సాక్షి తన పంచ్ పవర్ చూపిస్తూ బ్రెజిల్ బాక్సర్ తతియనా రెజీనా జీసస్ చగాస్‌ను ఓడించింది. ప్రత్యర్థి నుంచి కనీస ప్రతిఘటన లేకపోవడంతో ఏకపక్ష పోరులో సాక్షి విజయదుందుబి మోగించింది.

వేదిక ఏదైనా తమకు తిరుగులేదని చాటుతున్నారు భారత బాక్సర్లు. హితేశ్, సాక్షిలు ప్రత్యర్థులను చిత్తు చేసి ఫైనల్‌కు అడుగు దూరంలో నిలిచారు. బుధవారం జరిగిన బౌట్స్‌లో మీనాక్షి(48 కిలోలు), పూజా రాణి(80 కిలోలు), సంజూ(60 కిలోలు)లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. మిగతా వాళ్లలో అనామిక (51 కిలోలు) క్వార్టర్ ఫైనల్ ఫైట్‌కోసం కాచుకొని ఉంది. దాంతో, ఈసారి మరిన్ని పతకాలు భారత్ ఖాతాలో చేరడం ఖాయం. అదే జరిగితే.. టోర్నీకి ఇండియా బృందం ఘనంగా వీడ్కోలు పలకనుంది.

# అదిరిపోయేలా హరిహరవీరమల్లు ట్రైలర్

**టాకీస్:** పవన్ ఫ్యాన్స్‌కు పండగే పండగ. హరిహర వీరమల్లు థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేశారు. దాదాపు మూడు నిమిషాల నిడివితో వచ్చిన ఈ ట్రైలర్ పవన్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ పట్టేలా.. విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఉంది. మేకర్స్ ముందు నుంచి చెబుతున్నట్టుగా.. అద్భుతమైన విజువల్స్‌తో హరిహర వీరమల్లు ట్రైలర్ అదిరి పోయింది. మూడే మూడు డైలాగ్స్‌తో సినిమా కథను చెప్పేశారు. హిందువుగా జీవించాలంటే పన్ను కట్టాల్సిన సమయం, ఈ దేశ శ్రమ బాద్‌షా పాదాల కింద నలిగిపోతున్న సమయం, ఒక వీరుడు కోసం ప్రకృతి పురుడు పోసుకుంటున్న సమయం.. అంటూ మొఘలులను ఎదురించిన వీరుని కథే హరిహర వీరమల్లు కథ అని చెప్పేశారు. కోహినూర్ డైమండ్ అంటూ పవన్‌కి ఇచ్చిన ఎలివేషన్ పీక్స్ అనే చెప్పాలి. పవర్ స్టార్ చెప్పిన డైలాగ్స్ బాగున్నాయి. పులిని వేటాడే బెబ్బులిని చూస్తారు అంటూ.. పవన్ చెప్పిన డైలాగ్ విజిల్స్ వేసేలా ఉంది. అలాగే.. మన దేశ ప్రధాని మోదీ పవన్ గురించి చెప్పిన 'యే పవన్ నహీ ఆంధీ హై' డైలాగ్‌ను ట్రైలర్‌లో హైలెట్ చేశారు. విలన్ బాబీ డియోల్ చేత.. ఆంధీ వచ్చేసింది అంటూ ఎలివేషన్ ఇచ్చారు.



ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్‌ను పవర్ ఫుల్‌గా చూపించారు. ఇక పవన్ లుక్, యాక్షన్, విజువల్ పరంగా ట్రైలర్ అదరహో అనేలా ఉంది. కాకపోతే.. కొన్ని ఫ్రేమ్స్‌లో సీజీ వర్క్ పై ఇంకాస్త దృష్టి పెట్టాల్సింది. కానీ పీరియాడికల్ సెటప్ మాత్రం అదిరిపోయింది. నిర్మాత ఏ.ఎం.రత్నం పెట్టిన బ్జడెట్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది. హీరోయిన్ నిధి అగర్వాల్‌కు మంచి పాత్ర పడినట్టుగా ఉంది. ఆస్కార్ విన్నర్ ఎం.ఎం. కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. మొత్తంగా.. పవన్ ఫ్యాన్స్‌ను మెప్పించేలా ఉంది ఈ ట్రైలర్. ఇక్కడితో సినిమా పై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. వీరమల్లు విధ్వంసం ఎలా ఉంటుందో చూడ్డానికి ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు అభిమానులు. మరి హరిహర వీరమల్లు ఎలా ఉంటుందో తెలియాలంటే.. జులై 24 వరకు వెయిట్ చేయాల్సిందే.

# హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కి ఎంపికైన దీపిక పదుకొణె

టాకీస్: ప్రముఖ నటి దీపికా పదుకొణెకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ఆమె హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కు ఎంపికయ్యారు. ఈ మేరకు హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమె ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. ఈ గౌరవం దక్కించుకున్న తొలి భారతీయ నటి దీపిక కావడం విశేషం. హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విడుదల చేసిన జాబితాలో డెమి మూర్, రాచెల్ మెక్ ఆడమ్స్,

**అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కించుకున్న నటి దీపిక పదుకొణె**

ఎమిలీ బ్లంట్ వంటి హాలీవుడ్ తారలతో పాటు దీపిక పేరు కూడా ఉండటంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కు 35 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసినట్లు ఛాంబర్ ప్రకటించింది. కాగా, దీపికా పదుకొణె 2006లో సినీ పరిశ్రమలోకి ప్రవేశించగా, 2017లో రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్‌తో హాలీవుడ్ తెరపై మెరిశారు. ప్రస్తుతం అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కలయికలో రానున్న బహుభాషా చిత్రంలో దీపిక నటిస్తున్నారు. దీని తర్వాత కల్కి 2898 ఏడీ సీక్వెల్‌లోనూ నటించనున్నారు.

**హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026లో దీపికకు చోటు**

**అధికారికంగా ప్రకటించిన హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్**




## రామాయణం ఎప్పటికీ
# ఆదర్శణీయ కావ్యం
### బాలీవుడ్ రామాయణ గ్లింప్స్ విడుదల

**టాకీస్:** యుగాలు మారినా.. తరాలు మారినా.. విన్న ప్రతిసారీ భక్తిభావంతో ఓలలాడించే కావ్యం రామాయణం. ఇప్పుడీ కథను బాలీవుడ్ 'రామాయణ' సినిమాగా మన ముందుకు తెస్తోంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి రావణుడిగా యశ్ నటించిన 'రామాయణ' గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేసింది. 'ముల్లోకాలను త్రిమూర్తులు పరిపాలిస్తున్నారు. బ్రహ్మ.. సృష్టించే దేవుడు; విష్ణువు.. రక్షించే దేవుడు; శివుడు.. అంతం చేయగలిగే దేవుడు. కానీ, వారు సృష్టించిన మూడు లోకాలపై ఆధిపత్యం కోసం ఎదురు తిరిగినప్పుడు అన్ని యుద్ధాలను అంతం చేసే యుద్ధం ప్రారంభమైంది. 5వేల



సంవత్సరాల నుంచి 2500 కోట్ల మంది ప్రజలు ఆరాధించేది. ఇది ఒక అమరమైన ఇతిహాసగాథ.. రామాయణం మన వాస్తవం.. మన చరిత్ర' అంటూ గ్లింప్స్‌ను పంచుకుంది. ఇక ఇందులో లక్ష్మణుడిగా రవి దుబే, హనుమంతుడిగా సన్నీ దేఓల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్ పై ఎన్నో రామాయణ కథలు సినిమాలుగా వచ్చి సూపర్ హిట్ గా నిలిచాయి. ఇంకా మరెన్నో సినిమాలు వస్తూనే ఉంటాయి. అందుకే రామాయణం ఎపిక్. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా బాలీవుడ్ లో రామాయణ ఇతిహాసంలో 'రామాయణ' అనే సినిమా వస్తుంది. ఇక ఈ కథలో కీలకమైన రావణాసురిడి పాత్రలో కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్నాడు. ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా స్టార్ట్ అయిన ఈ సినిమా షూటింగ్ చకచక జరుగుతోంది. కానీ ఈ సినిమాకు సంబంధించి కనీసం ఒక పోస్టర్ ను కూడా రిలీజ్ చేయలేదు మేకర్స్. రణబీర్ రాముడు పాత్రలో నటిస్తుండడంతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇన్ని రోజులు ఈ సినిమా ఎలా ఉంటుందా అని ఎదుచూసిన మేకర్స్ చిన్న పాటి గ్లిమ్స్ తో వీడియో రిలీజ్ చేసారు. ఎవరెవరు ఏ ఏ పాత్రలు పోషిస్తున్నారో తెలియాజేస్తూ చివరిలో యష్ ను లుక్ ను చూపిస్తూ ఎండ్ లో రాముడుగా రణబీర్ ఎంట్రీ ఫ్రెమ్ ఓ రేంజ్ లో ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే రామయణ ఇంట్రడక్షన్ ఊహించిన దానికి మించి ఉండబోతుందని తెలుస్తోంది. ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్ టాప్ క్లాస్ ఉంది. భారీ బ్జడెట్ పై తెరకెక్కుతున్న ' రామాయణ' ఫస్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళి కానుకగా రిలీజ్ కానుంది. సెకాండ్ పార్ట్ ను 2027 దీపావళికానుకగా రిలీజ్ చేస్తామని తెలిపారు.

# తమ్ముడు ప్రమోషన్లకు దూరంగా నితిన్

**టాకీస్:** రాబిన్‌హుడ్ తర్వాత నితిన్ నుండి వస్తోన్న మూవీ తమ్ముడు. వేణు శ్రీరామ్ దర్శకుడు. ఈ శుక్రవారం థియేటర్లలోకి రాబోతుంది. ఈ సినిమాతో నితిన్ బౌన్స్ బ్యాక్ అవుతాడని మేకర్స్ గట్టిగానే చెబుతున్నారు. కానీ నితిన్ మాత్రం సైలెంట్‌గా స్మైల్ ఇస్తున్నాడు. చెప్పాలంటే పెద్దగా ప్రమోషన్లలో పార్టిసిపేట్ చేయడం లేదు. మరి ప్రమోషన్ల సంగతేంటీ అంటే వాటిని మేకర్స్‌తో పాటు హీరోయిన్స్ భుజానకెత్తుకున్నారు.



సినిమా ఎనౌన్స్ మెంట్ నుండి రిలీజ్ వరకు మేకర్లతో పాటు భుజాన వేసుకుని చేస్తున్నారు హీరోయిన్స్. హాయ్, బై చెప్పామా అని కాకుండా అవసరమైనప్పుడల్లా లయ, వర్ష బొల్లమ్మ, స్వసిక, సప్తమి గౌడలు తమ్ముడు టీమ్‌కి అండగా నిలుస్తున్నారు. దర్శకుడు వేణు శ్రీరామ్‌తో కలిసి ప్రమోషన్లను చేస్తున్నారు. తమ్ముడు ఎనౌన్స్ మెంట్ నుండి ప్రీ రిలీజ్ ఈవెంట్స్ వరకు వరుస ఇంటర్వ్యూలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. మరి ఈ ప్రమోషన్లు ఎంత వరకు వర్కౌట్ అయ్యాయి అంటే సినిమాపై గట్టి బజ్ నడిచేలా ఇంపాక్ట్ క్రియేట్ చేయగలిగాయి. తమ్ముడు అటు దర్శకుడికి, ఇటు హీరోకి చాలా కీలకం. అలాంటిది నితిన్ ప్రమోషన్స్ ఏ లెవల్లో చేయాలి.. కానీ కామ్‌గా ఉంటున్నాడు. దీనికి కారణం రాబిన్ హుడ్ డిజాస్టర్. హిట్ కాంబోలో తెరకెక్కిన రాబిన్ హుడ్‌పై ఎన్నో హోప్స్ పెట్టుకున్నాడు నితిన్. ఆ సినిమా ప్రమోషన్స్ లో ఎక్కడ చూసినా నితినే కనిపించాడు. కానీ ఆ సినిమా డిజిస్టార్ తో ఒక్కసారిగా డీలా పడిపోయాడు. ఇప్పుడు ప్రమోషన్లకు దూరంగా ఉండటానికి ఇదే కారణమంటున్నారు.

# ధనుష్ అత్యుత్తమ నటుల్లో ఒకరు



### 'తేరే ఇష్క్ మే' గురించి కృతి సనన్

**టాకీస్:** కోలీవుడ్ హీరో ధనుష్ తన నటనతో ఇప్పటికే తమిళ ప్రేక్షకుల మనసులు గెలుచుకోగా.. అతని టాలెంట్ అక్కడే ఆగలేదు.. బాలీవుడ్, హాలీవుడ్ సినిమాల్లోనూ చక్కటి నటనతో తిరుగులేని మార్కెట్ సంపాదించు కున్నారు. ఇప్పుడు



ఆయన నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా, 'రాంజనా', 'అత్రంగి రే' తర్వాత ధనుష్ ఆనంద్ కలయికలో వచ్చిన మూడో సినిమా ఇది. తాజా అప్డేట్ ప్రకారం ఈ సినిమా షూటింగ్ పూర్తి అయిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా కృతి సనన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ షేర్ చేస్తూ ధనుష్‌పై ప్రశంసల జల్లు కురిపించింది. నేను ఇప్పటి వరకు కలిసి పనిచేసిన అత్యుత్తమ నటుల్లో ధనుష్ ఒకరు. అతనితో పని చేయడం సంతోషంగా ఉంది. ఈ జర్నీ ఎంతో స్పెషల్‌గా మిగిలిపోతుంది' అని పేర్కొంది. అలాగే, దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ గురించి కూడా ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది.. 'ఈ సినిమాకు నన్ను ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు సర్. ఇది ఓ రోలర్ కోస్టర్ రైడ్‌లా వేగంగా పూర్తయిపోయింది' అని తెలిపింది. ఇది ధనుష్, కృతి సనన్ జంటగా నటిస్తున్న మొదటి సినిమా, అందుకే ఈ కాంబినేషన్‌పై అభిమానుల్లో మంచి క్యూరియాసిటీ నెలకొంది.




## హక్కుల కోసం పోరాడే
# తల్లి పాత్రే..మైసా

టాకీస్: ప్రస్తుతం ఇండస్ట్రీలో వరుస హిట్లతో దూసుకెళ్తున్న స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న 'యానిమల్', 'పుష్ప 2', 'ఛావా' ఇలా బ్లాక్ బస్టర్ హిట్లతో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నారు. ఇక ఆమె తాజాగా నటించబోతున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మైసా. ఈ ప్రాజెక్టు నుంచి రష్మిక ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే సోషల్ మీడియాలో విపరీతమైన హైప్ క్రియేట్ అవుతుంది. ఇప్పటి వరకు ఎన్నడూ లేని విధంగా రక్తంతో ముఖం, చేతిలో ఆయుధం, ముక్కుపుడకతో ఆమె లుక్ చూసి అంతా షాక్ అయ్యారు. 'ధైర్యం ఆమె బలం..ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి..' అంటూ ఇచ్చిన హైప్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇక..'మైసా' అనే టైటిల్ అనౌన్స్ చేయగానే అందరిలోనూ ఓ ఆసక్తి నెలకొంది. అసలు మైసా అంటే ఏంటనే ప్రశ్నలు మొదలు అయ్యాయి. రష్మిక లుక్‌కు ఈ పేరుకు సంబంధం ఏంటి? అంటూ సోషల్ మీడియాలో పెద్ద చర్చే సాగింది. అయితే 'మైసా' అనే పదం వివిధ భాషల మూలాల నుంచి తీసుకున్నారు. స్వీడిష్, అరబిక్, జపనీస్, జార్జియన్ భాషల్లో 'మైసా' అనే పదానికి 'తల్లి' అని అర్థం. స్వేచ్ఛా భావాలతో, సహజ నాయకత్వంలో ముందుకు సాగిన ఓ సాహసవంతురాలి పాత్రకు ఇది సరైన టైటిల్ అని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాలో రష్మిక వారియర్ మదర్ కనిపించనున్నారు. గోండు తెగల పటిష్ఠమైన సామాజిక నేపథ్యం ఆధారంగా ఈ కథ సాగనుంది. ఈ తెగల హక్కుల కోసం పోరాడే ఓ తల్లిగా, నాయకురాలిగా రష్మిక పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. ఆమె పాత్రలో ఉన్న తీవ్రత, ఎమోషన్‌ను ఫస్ట్ లుక్ స్పష్టంగా అర్థమవుతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.